
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం
12 ఏప్రిల్, 2026













# చరిత్రకు దర్పణాలు
# వారసత్వ కట్టడాలు



# బాలయ్య సినిమాలో బ్యూటీరాయ్

బాలయ్యబాబు- గోపీచంద్ మలినేని కలయికలో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో బోల్డ్ బ్యూటీ లక్ష్మీ రాయ్ కీలక పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నయనతార నటిస్తోంది. ఈ సినిమాలో లక్ష్మీ రాయ్ పాత్ర ఏమిటో చూడాలి మరి.

ఆమె పాత్ర సెకండ్ హాఫ్‌లో వస్తోందని.. ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యత ఉంటుందని టాక్ నడుస్తోంది. గతంలో లక్ష్మీ రాయ్, బాలయ్య కలిసి 'అధినాయకుడు' చిత్రంలో కలిసి నటించారు.

సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పీరియాడిక్ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమా గురించి గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా ఆ మధ్య స్పందిస్తూ.. "గాడ్ ఆఫ్ మాసెస్ ఈజ్ బ్యాక్.. ఈసారి మా గర్జన మరింత గట్టిగా ఉండనుంది. బాలకృష్ణతో కలిసి మరోసారి వర్క్ చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

ఇది చరిత్రలో నిలిచిపోయే చిత్రం కానుంది" అని తన పోస్ట్ లో పేర్కొన్నారు.

నందమూరి బాలకృష్ణ నటించనున్న 111 ప్రాజెక్ట్ ఇది.

# 'లాటరీ కింగ్'లో ఐశ్వర్య రాజేష్?

అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రం 'లాటరీ కింగ్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో టాలెంటెడ్ నటి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటి టబు కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.

వెంకటేష్ సరసన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య రాజేష్, ఇప్పుడు కింగ్ నాగార్జునతో జోడీ కట్టడంపై ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కాంబినేషన్ ఈ సినిమాకు కొత్తదనాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.

ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. నాగార్జున వంటి స్టార్ హీరో తన ల్యాండ్‌మార్క్ మూవీ కోసం ఒక యువ తమిళ దర్శకుడిని నమ్మడం ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది.

'లాటరీ కింగ్'లో నాగార్జున అత్యంత స్టైలిష్‌గా కనిపించబోతున్నారని తెలుస్తోంది. గతంలో ఆయన నటించిన శివ, రక్షకుడు, కూలీ వంటి చిత్రాల గెటప్పుల స్ఫూర్తితో ఇందులో రకరకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఐశ్వర్య రాజేష్ నటనకు స్కోప్ ఉన్న పాత్రలో కనిపిస్తుండగా, టబు ఉండటం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. నాగార్జున కెరీర్‌లో ఈ 100వ చిత్రం ఒక చిరస్మరణీయమైన సినిమాగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



ఆదివారం వార్త
12 ఏప్రిల్, 2026

## మంచి ముత్యాలు

– నవ్వు లేని ముఖం నిరుపయోగమైన ముఖం. – మార్వెల్

– ఖర్చు పెట్టాక బాధపడే బదులు.. ఖర్చు పెట్టడానికి ముందు పడే బాధను బడ్జెట్ అంటారు. – వాల్

## కదంబం

'సంఘీ'భావం....5
ఎట్టకేలకు రాజధాని ఏర్పాటు

కవర్ స్టోరీ..6
చరిత్రకు దర్పణాలు వారసత్వ కట్టడాలు

ఈ వారం కవిత్వం.. 11
దృక్కులు

అరుదైన శివలింగం... 18

కథ..20
మాతృభాష మాధుర్యం

ఇంకా...
మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## రాత్రిపూట పని చేస్తే..

"పగటిపూట కన్నా రాత్రుళ్లు ఎక్కువ ఉత్సాహంగా ఉండేవాళ్లకీ, పగటి సమయాల్లో మాత్రమే చురుగ్గా ఉండేవాళ్లకీ హృద్రోగ సమస్యల్లో వ్యత్యాసం ఉంటుందా? ఒకవేళ ఉంటే ఆ వ్యత్యాసం స్త్రీ, పురుషుల్లో సమానంగా ఉంటుందా? అన్న సందేహాలను తీర్చ పరిశోధన ఇది. బ్రిటన్‌లోని బ్రిగమ్ అండ్ విమెన్స్ హెల్త్ సంస్థకి చెందిన శాస్త్రవేత్తలు నిర్వహించిన ఈ పరిశోధన కోసం పద్నాలుగు సంవత్సరాలు సుమారు మూడు లక్షల మందిని పరిశీలించారు. రాత్రి సమయంలో మేల్కొని, హుషారుగా ఉంటామని అనుకునే వాళ్లలో మిగతావారితో పోల్చి చూస్తే వీరిలో 79 శాతం హృద్రోగ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గమనించారు. మహిళల్లో ఇది మరో ఐదు శాతం ఎక్కువట. రాత్రి సమయంలో మేలుకునే వారిలో వ్యాయామం తక్కువగా ఉండటం. పగటిపూట కూడా సరిగ్గా నిద్ర పోకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవటం ఈ సమస్యలకి కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ మూడు విషయాలను సరిచేసుకొని హృద్రోగం నుంచి స్వస్థత పొందినవాళ్లలోనూ మహిళలే ఎక్కువగా ఉన్నారట!



## పిల్లలతో.. హుషారుగా!

అరవై ఏళ్లు దాటిన వాళ్లలో మెదడు చురుకుదనం, జ్ఞాపకశక్తి తగ్గుతుంది, మాటలు తడబడతాయి అంటుంటారు. కానీ మనవలు, మనవరాళ్లతో ఉత్సాహంగా గడిపేవాళ్లలో వృద్ధాప్యంలో వచ్చే లోపాలు వీరిలో కనిపించడం లేదంటున్నారు పరిశోధకులు. పిల్లలకు దూరంగా వున్న వృద్ధుల కంటే వీరి మెదడు చాలా చురుగ్గా ఉంటోందని నిపుణులు అంటున్నారు. చిన్న పిల్లలకు కథలు, కబుర్లు చెప్పడం, బడికి తీసుకెళ్లడం మొదలైనవి వాళ్ల మేధాశక్తి తగ్గకుండా చూస్తున్నాయట.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# విమానంలో డేగలు

వినడానికి వింతగా ఉన్నా ఇది నిజమే. ఆకాశంలో ఎగురుతూ చెట్లపై ఉండే డేగలు విమానంలో అదీ బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నాయంటే ఆశ్చర్యమే కదా!



ఖతార్‌లో డేగలకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. డేగలకు యుఎఇ అధికారిక పాస్‌పోర్టులను జారీ చేస్తుంది. అరబ్ పర్యటనకు వెళ్లిన కొందరు ఖతార్ ఎమిరేట్స్ విమానంలో బిజినెస్ క్లాస్‌లో ముందు వరుసలో ఉన్న డేగలను చూసి విస్తుపోయారట. అవి కూడా టికెట్లు తీసుకున్నాయి. వాటికి కూడా పాస్‌పోర్టులు ఉన్నాయి.. అంటూ వాటి గురించి సిబ్బంది వివరించగానే ఆశ్చర్యపోవడం వారి వంతయింది. మన దగ్గర సంక్రాంతికి కోడిపందేలు జరిగినట్లే అరబ్ దేశాల్లో డిసెంబర్, జనవరి నెలల్లో డేగల పోటీలు జరుగుతాయి. వివిధ ప్రాంతాల్లో రకరకాల వస్తువుల్ని పెట్టి ఏ డేగ తొందరగా తెస్తుందో దానికి బహుమతి ఇస్తారు. ఆ డేగలను పెంచుకోవడం స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. అందుకే ఈ పోటీల కోసం డేగలను విమానాల్లో అదీ బిజినెస్ క్లాస్‌లో తీసుకెళతారు. ఆయా దేశాలు ఇందుకోసం వాటికి ప్రత్యేక పాస్‌పోర్టులు అందిస్తుంటాయి. కొందరు యజమానులు డేగలను తమ లగేజీతో పాటే తీసుకెళుతూ ఉంటారు.



# స్టాక్ చెకింగ్ రోబో

పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో సరుకులు, కూరగాయలు అయిపోతే అక్కడి ఉద్యోగులు సమయానుసారంగా చెక్ చేస్తూ ఆ విషయం యాజమాన్యానికి తెలియచేస్తారు. వెంటనే అవసరాన్ని బట్టి సరుకులు/కూరగాయలు తెప్పిస్తారు యాజమాన్యం. అయితే అమెరికా లాంటి దేశాల్లో ఉద్యోగులు చెక్ చేయాల్సిన అవసరం లేదు. అక్కడ ఈ పని ఒక రోబో చేస్తుంది. ఈ రోబో పేరు స్టాక్ చెకింగ్ రోబో. దీని ప్రత్యేకత ఏమిటంటే– పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో ఏవైనా సరుకులు ఖాళీ అయితే దీనికి అనుసంధానమైన సెన్సర్లు ఆ విషయం గుర్తించి, సంబంధిత విభాగాలకు తెలియపరుస్తుంది. తద్వారా ఆ విభాగాలను అప్రమత్తం చేస్తుంది.

# స్క్రోల్.. సో ఈజీ!

కీ బోర్డ్‌పై టైపింగ్ చేసేటప్పుడు, ఫోన్ స్క్రోల్ చేసేటప్పుడు మంచు తగిలినట్లు చల్లగా అనిపిస్తే చిరాకుగా ఉంటుంది. అందుకు ఒక చక్కని పరిష్కారం ‘బికెఎన్ టచ్ మొబైల్ స్క్రీన్ స్లీవ్ గ్లోవ్స్’. మెత్తని సాఫ్ట్ ఫ్యాబ్రిక్‌తో తయారైన ఈ గ్లోవ్స్ చేతులను వెచ్చగా కప్పేసి చలిలో కూడా హాయిగా ఉంచుతాయి. చేతులు వేడిగా ఉండడం మాత్రమే కాదు, గ్లోవ్స్ వేసుకుని ఫోన్ ఉపయోగించడం చాలా సులువు. ఎందుకంటే రెండు వేళ్లకు ప్రత్యేక టచ్ ఫీచర్ ఉంటుంది.



ఫోన్ ఈజీగా ఆపరేట్ చేయొచ్చు. మెసేజ్ టైప్ చేయొచ్చు. సెల్ఫీ క్లిక్ చేయొచ్చు. ఏది చేసినా గ్లోవ్స్ తీసే పని ఉండదు. స్ట్రెచ్ అయ్యే వీలుంది కాబట్టి ఎవరికైనా సులభంగా సరిపోతాయి. రోజువారి వాడకానికి లైట్‌గా, కంఫర్ట్‌గా, యూజర్ ఫ్రెండ్లీగా ఉంటాయి.

## 'సంఘీ' భావం



# ఎట్టకేలకు రాజధాని ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన జరిగి సుమారు దశాబ్ద కాలం దాటిన తరువాత ఎట్టకేలకు అమరావతి రాజధానిగా ఏర్పాటుకు చట్టబద్ధమైన వెసులుబాటు కలిగింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులను మార్చే ప్రమాదం ఉండటంతో ఏకంగా కేంద్రం నుంచి చట్టబద్ధమైన నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చారు. మరోపక్క రాజధాని నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సకాలంలో అమరావతి పూర్తి స్థాయి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సన్నిహితంగా, వివాదాలకు దూరంగా ఉంటే మంత్రి నారాయణ సిఆర్‌డిఏకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటిదాకా అమరావతి ప్రభుత్వ ఉత్తర్వులకు మాత్రమే పరిమితమై ఉండేది. అయితే ఎప్పుడైతే పార్లమెంటు స్థాయి నుంచి ఆమోదం లభించిందో ఒక శాశ్వత గుర్తింపు లభించినట్లైంది. దీనికి అనుగుణంగా తపాలాశాఖ అమరావతికి ప్రత్యేక పిన్ కోడ్ (పోస్టల్ ఇన్‌డెక్స్ నంబర్)ను కేటాయించడానికి అనుమతి కూడా లభించింది. దేశ పార్లమెంటులో రాజ్యాంగబద్ధంగా విభజన చట్టాన్ని సవరించి అమరావతి రాజధాని అనే మార్పును తీసుకురావడం విశేషం. ఇది కేవలం కాగితం మీద పేరు మార్పు కాదు, అమరావతి చుట్టూ ఒక అభేద్యమైన రక్షణ కవచం. ఈ సవరణతో అమరావతి నిర్ణయాధికారం రాష్ట్ర పరిధి నుంచి కేంద్ర చట్టం పరిధిలోకి వెళ్లింది. రేపు ఏ ప్రభుత్వం వచ్చినా, ఒక అసెంబ్లీ తీర్మానంతో రాజధానిని మార్చడం అసాధ్యం! అది మారాలంటే మళ్లీ దేశ పార్లమెంటే ఆమోదించాలి. అమరావతి ఇప్పుడు ఏపీ రాజధాని మాత్రమే కాదు.. కేంద్ర గెజిట్‌లో నమోదైన అజేయమైన నగరంగా పేర్కొనవచ్చు. భూములిచ్చిన రైతులతో జరిగిన ఒప్పందాలకు ఈ సవరణ ఒక సావరీన్ గ్యారెంటీగా నిలుస్తుంది. న్యాయపరమైన చిక్కులన్నింటికీ ఈ ఒక్క గెజిట్ నోటిఫికేషన్ శాశ్వత ముగింపు పలికినట్లైంది. దేశంలో ప్రతి రాష్ట్రానికి ఒక రాజధాని నగరం ఉంటుంది. అక్కడి నుంచే ప్రభుత్వ పాలన సాగుతుంది. ఇది గతం నుంచి అమలులో ఉంది. అదేవిధంగా జిల్లాలకూ జిల్లా కేంద్రం ఉంటుంది. ఇవన్నీ పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన కేంద్రాలు. రాష్ట్ర రాజధాని అంటే ప్రభుత్వం యంత్రాంగం, పాలనా వ్యవస్థ, అత్యున్నత న్యాయ వ్యవస్థలు అక్కడే ఏర్పాటు అవుతాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా 2014లో విడిపోయింది. అప్పటిదాకా రాష్ట్రానికి రాజధానిగా ఉన్న హైదరాబాద్ తెలంగాణకు పరిమితమైంది. దీనితో ఆంధ్రప్రదేశ్‌కు మరో రాజధానిని ఏర్పాటు చేసుకోవల్సిన అవసరం ఏర్పడింది. రాష్ట్రం విడిపోవడంతో ఒక్కసారిగా పాలనా వ్యవస్థను మార్చుకోవడం సమస్యలు ఉంటాయి కాబట్టి పదేళ్ల పాటు ఉమ్మడిగా హైదరాబాద్‌ను ఉపయోగించుకోవచ్చని విభజన చట్టంలో స్పష్టం చేశారు. ఆ లోగా రాజధానిని ఏర్పాటుచేయడానికి ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గతంలో కర్నూలు రాజధానిగా ఉండేది. ఆ తరువాత హైదరాబాద్‌కు మార్చడం జరిగింది. రాష్ట్రం విడిపోయిన తరువాత కర్నూలును తిరిగి రాజధానిగా చేయాలన్న ఆలోచనలు వచ్చినప్పుడు భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉభయ గోదావరి జిల్లాలకు రాజధాని అందుబాటులో ఉండదని భావించారు. దీనితో విజయవాడ, గుంటూరుకు సమీపంలో ఉన్న అమరావతిని రాజధానిగా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి అన్ని పార్టీల మద్దతుతో అంగీకరించారు. మొదటి 5 సంవత్సరాల్లో పనులు సుమారు 40 శాతం వరకు పూర్తయ్యాయి. కొన్ని పునాదుల దశలో ఉన్నాయి. హైకోర్టు నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇక అధికారులు, న్యాయమూర్తులు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణం చురుగ్గా సాగుతున్న తరుణంలో 2019లో వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరాజయం పొంది వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజధానిని మూడు ప్రాంతాలకు విస్తరింపచేయాలని నిర్ణయించారు. దీనితో పరిపాలనా రాజధానిగా విశాఖపట్నంను, జ్యుడీషియల్ రాజధానిగా కర్నూలును, అసెంబ్లీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే అనుకున్న స్థాయిలో పనులు ఎక్కడా జరగలేదు. ఈ ప్రయత్నాలు కొనసాగుతుండగానే మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు 2024లో వచ్చాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ పరాజయం పొందింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు అమరావతిని రాజధాని చేయడానికి పావులు కదిపి పార్లమెంటు స్థాయిలో చట్టబద్దతను పొందేలా చేశారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హకీం జాని

# చరిత్రకు దర్పణాలు వారసత్వ కట్టడాలు

**ప్రపంచ వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో కొన్ని మాత్రమే యునెస్కో వారిచే ప్రపంచ వారసత్వ కట్టడాలుగా గుర్తింపు పొందాయి. అటువంటి వారసత్వ కట్టడాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నేటికీ నిలిచి వున్నాయి. వీటిని పరిరక్షించుకోవలసిన అవసరం ఉంది.**

ప్రపంచంలో చారిత్రక, సాంస్కృతిక, శిల్పకళాత్మక, ప్రకృతి పరంగా అత్యంత విలువైనదిగా గుర్తించిన ప్రదేశాన్ని ప్రపంచ వారసత్వ కట్టడం అంటారు. ఈ ప్రదేశాలను యునెస్కోవారు ప్రత్యేక ప్రమాణాల ప్రకారం ఎంపిక చేసి, ప్రపంచానికి సంరక్షణ బాధ్యతగా ప్రకటిస్తుంది. ప్రాకృతిక, సాంస్కృతిక వారసత్వ వనరులు ప్రపంచ మానవాళి ఉమ్మడి సంపద.

ప్రపంచ మానవాళి అంతా ఒక్కటే అనే భావనను పెంపొందించడానికి పలు దేశాలలోని వారసత్వ చిహ్నాలను పరిరక్షించడానికి యునెస్కో అకుంఠిత దీక్షతో కృషి చేస్తుంది. వాటిని కాపాడుకోవలసిన బాధ్యతను అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలకు యునెస్కో గుర్తుచేస్తుంది.

దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పరిపాలనను ప్రతిబింబించే పురాతన కట్టడాలు ప్రపంచ వ్యాప్తంగా అనేకం ఉన్నాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన యునెస్కో ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ ప్రదేశాల గుర్తింపు, నిర్వహణ జరుగుతోంది.

ప్రపంచ దేశాల వారసత్వ సంపద పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం సంయుక్తంగా ఆఫ్రికాలోని ఛిట్యునీషియాఖిలో 1982 ఏప్రిల్ 18న సమావేశం నిర్వహించాయి. ఆ రోజు నుండి ప్రతి ఏటా ప్రపంచ వారసత్వ దినోత్సవంగా జరుపుకుంటారు.

## వారసత్వ కట్టడం అంటే ఏమిటి?

ప్రపంచ వారసత్వ కట్టడం అంటే మానవాళి మొత్తానికి సంబంధించి అత్యంత విశిష్టమైన సాంస్కృతిక, సహజ విలువలను కలిగివుందని యునెస్కో చేత గుర్తింపు పొందిన ప్రదేశం. యునెస్కో నిబంధనల ప్రకారం ఏదైనా ఒక కట్టడం, ప్రదేశం రాబోయే తరాల కోసం భద్రపరచాల్సిన అసాధారణమైన సార్వత్రిక విలువను కలిగివుంటే దానిని ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తిస్తారు.

ఇలా ప్రపంచ వారసత్వ కట్టడాలుగా గుర్తింపు ఇవ్వడానికి యునెస్కోవారు ముఖ్యంగా మూడు రకాలుగా విభజించారు.

**సాంస్కృతిక వారసత్వం:** చారిత్రక కట్టడాలు, నగరాలు, పురావస్తు ప్రదేశాలు (ఉదాహరణకు రామప్ప దేవాలయం, తాజ్ మహల్),

**సహజ వారసత్వం:** జాతీయ పార్కులు, పర్వత శ్రేణులు, అడవులు (ఉదాహరణకు పశ్చిమ కనుమలు, కాజీరంగా నేషనల్ పార్క్),

**మిశ్రమ వారసత్వం:** అటు సాంస్కృతిక, ఇటు సహజ ప్రాధాన్యత కలిగినవి.

## ఎలా ఎంపిక చేస్తారు?

ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందడానికి అనేక ముఖ్య లక్షణాలు అవసరం. చారిత్రక లేదా సాంస్కృతిక విలువ కలిగి ఉండాలి. విశిష్టమైన శిల్పకళ, నిర్మాణ వైశిష్ట్యం ఉండాలి. ప్రకృతి అద్భుతం, అరుదైన జీవవైవిధ్యం కలిగి ఉండాలి. మానవాళి



కోసం సంరక్షించాల్సిన అవసరం ఉండాలి. వారసత్వ కట్టడంగా యునెస్కోవారి గుర్తింపు రావడం వల్ల ఆ కట్టడాలకు అంతర్జాతీయ స్థాయిలో రక్షణ, నిధులు, పర్యాటక గుర్తింపు లభిస్తాయి. ఒక ప్రదేశాన్ని వారసత్వ జాబితాలో చేర్చాలంటే అది కొన్ని ప్రత్యేక నిబంధనలను పాటించాలి. ఆ కట్టడం మేధస్సుకు నిదర్శనంగా ఉండాలి. ఒక నిర్దిష్ట కాలానికి చెందిన వాస్తుశిల్పం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతింబించాలి. అంతరించిపోతున్న సంస్కృతి సాక్ష్యంగా ఉండాలి.

2026 నాటికి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 170 దేశాలలో 1248 వరకు ప్రపంచ వారసత్వ కట్టడాలుగా గుర్తింపు పొందినట్లు అంచనా, వీటిని మూడు రకాలుగా వర్గీకరించారు. సాంస్కృతిక కట్టరాలు 972 ప్రకృతి సిద్ధమైనవి 236, మిశ్రమ కట్టడాలు 41. మన దేశంలో 2026 నాటికి 44 కట్టడాలు వారివత్వ గుర్తింపు పొందాయి. వీటిలో సాంస్కృతిక కట్టడాలు 36, సహజసిద్ధమైనవి 7, మిశ్రమ కట్టడం ఉన్నాయి.

## మన దేశంలో సాంస్కృతిక కట్టబాలు-యునెస్కో గుర్తింపు పొందిన సంవత్సరాలు

అజంతా గుహలు (మహారాష్ట్ర 1983), ఎల్లోరా గుహలు (మహారాష్ట్ర 1983), ఆగ్రా కోట (ఉత్తరప్రదేశ్-1983), తాజ్ మహల్ (ఉత్తరప్రదేశ్ 1983), కోణార్క్ సూర్య దేవాలయం (ఒడిశా 1984), మహాబలిపురం కట్టడాలు (తమిళనాడు 1984), గోదా చర్చిలు, కాన్సెంట్లు (గోదా 1986) ఖజురహో కట్టడాలు (మధ్యప్రదేశ్ 1986), హంపి కట్టడాలు (కర్ణాటక 1986), ఫతేపూర్ సిక్రి (ఉత్తరప్రదేశ్ 1986), పట్టడకల్ కట్టణాలు (కర్ణాటక 1987), ఎలిఫెంటా గుహలు (మహారాష్ట్ర 1987), చోళ రాజవంశ దేవాలయాలైన తంజావూరులోని బృహదీశ్వరాలయం, గంగైకొండ చోళపురం, ఐరావతేశ్వర ఆలయం, పట్టడకల్ దేవాలయాలు (తమిళనాడు 1987), సాంచి బౌద్ధ స్థూపాలు (మధ్యప్రదేశ్ 1989), హుమాయూన్ సమాధి (ఢిల్లీ 1993), కుతుబ్ మినార్ (ఢిల్లీ 1993), మౌంటైన్



రైల్వేస్ (డార్జిలింగ్, నీలగిరి, కాల్కా -సిమ్లా 1999), మహాబోధి ఆలయం (బీహార్ 2002), భీంబెట్కాలోని రాతి ఆవాసాలు, మధ్యప్రదేశ్ 2003), ఛత్రపతి శివాజీ టెర్మినస్ (ముంబై 2004), చంపానేర్ పావగఢ్ పార్క్ (గుజరాత్ 2004), ఎర్రకోట (ఢిల్లీ 2007), జంతర్ మంతర్ (జైపూర్ 2010), రాజస్థాన్ కొండ కోటలు (రాజస్థాన్ 2013), రాణి కీ వావ్(గుజరాత్ 2014), నలంద మహావిహార (బీహార్ 2016), చండీగడ్‌లోని లే కార్బుజియర్ నిర్మించిన వాస్తు కట్టడాలు (చండీగఢ్ 2016), అహ్మదాబాద్ చారిత్రక నగరం 2017), విక్టోరియన్ గోతిక్ ఆర్ట్ డెకో (ముంబై 2018), జైపూర్ నగరం (రాజస్థాన్ 2019, రామప్ప దేవాలయం (తెలంగాణ 2021), ధోలవీర (గుజరాత్ 2021), శాంతినికేతన్ (పశ్చిమ బెంగాల్ 2023), హోయసల పవిత్ర సమూహాలు (కర్ణాటక 2023), మోయిదామ్స్ (అసోం 2024), మరాఠా సైనిక భూభాగాలు (మహారాష్ట్ర, తమిళనాడు 2025, తాజా చేర్పు) ఇత్యాదివి.

**సహజసిద్ధ ప్రాంతాలు:** కాజీరంగ నేషనల్ పార్క్ (అసోం), మానస్ వైల్డ్ లైఫ్ శాంక్చురీ (అసోం), కియోలాదేవ్ నేషనల్ పార్క్ (రాజస్థాన్), సుందర్బన్స్ నేషనల్ పార్క్ (పశ్చిమ బెంగాల్), నందా దేవి, వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ (ఉత్తరాఖండ్), పశ్చిమ కనుమలు (మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు), గ్రేట్ హిమాలయన్ నేషనల్ పార్క్ (హిమాచల్ ప్రదేశ్) ఇత్యాదివి.

**ఏకైక మిశ్రమ ప్రాంతం:** కాంచన జంగా నేషనల్ పార్క్ (సిక్కిం) ఇవన్నీ మనదేశంలో యునెస్కో వారిచే ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి.

భారతదేశంలో పురాతన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే వారసత్వ ప్రదేశాలు అనేకం ఉన్నాయి. సింధు నాగరికత, బౌద్ధ, అశోకుని కాలం నుంచి ఆరంభమైన చారిత్రక నిర్మాణాలు, శిల్పకళా సంపద ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం. ఉన్నాయి. రాజుల శిలా శాసనాలు, గుహలు, దేవాలయాలు, కోటలు ఇత్యాది కట్టడాలు మన చారిత్రక వారసత్వ సంపదకు గొప్ప నిదర్శనాలు, ప్రాచీన కట్టడం, చారిత్రక ప్రదేశం, ప్రాకృతిక సుందర ప్రదేశంగా యునెస్కో వారు వారసత్వ సంపదగా ఎంపిక చేసి ప్రకటించే ప్రక్రియలో పది నియమాలు ఉంటాయి. వాటిలో అతి ముఖ్యమైనది అత్యుత్తమ సార్వత్రిక విలువను కలిగి ఉండాలన్న నిబంధలకు లోబడి మన దేశంలో 62 ప్రదేశాలు తాత్కాలిక జాబితా వరకు వెళ్ళాయి. వాటిలో హైదరాబాద్లోని గోల్కొండ కోట, కుతుబ్షాహి సమాధులు, చార్మినార్, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి వీరభద్రాలయ సముదాయాలు, ఏకశిల నంది విగ్రహాలు ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రపంచ వారసత్వ కేంద్రంగా సూచించిన మార్గదర్శకాలను పాటిస్తే మునుముందు వీటిని యునెస్కోవారి గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. అలంపూర్‌లోని నవబ్రహ్మేశ్వరాలయ సముదాయం, వరంగల్ కోట, కొండవీటి కోట, గుత్తి దుర్గం, ముఖలింగంలోని మధుకేశ్వర భీమేశ్వరాలయ సముదాయం ఇత్యాది చారిత్రక కట్టడాలను ప్రపంచ స్థాయి కట్టడాల జాబితాలో చేర్చేందుకు ఎంపిక ప్రక్రియ నియమాలకు అనుగుణంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలి. అందుకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకుని పలు విభాగాల సమన్వయంతో ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సుశిక్షితులైన నిపుణులను సంప్రదించాలి. జర్మనీ, ఇటలీ, చైనా, ఫ్రాన్స్.. ఇత్యాది దేశాలు అక్కడి కట్టడాల నిర్వహణ, పరిరక్షణ, యాజమాన్య పద్ధతుల్లో అగ్రగామిగా పేరొందాయి. ఆ దేశాల బాటలో నడుస్తూ ఉత్తమ



ప్రమాణాలను పాటిస్తే మన దేశం కూడా వాటి సరసన నిలబడే అవకాశం ఉంది. ఆ కారణంగా అధిక సంఖ్యలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకుని ఆర్థికంగా లాభపడొచ్చు. మనదేశంలోని కేంద్ర పురావస్తుశాఖ భారతదేశం మొత్తంమీద 3600 రక్షిత చారిత్రక స్థలాలు, కట్టడాలను ప్రకటించింది.

వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 130, తెలంగాణలో 8 ఉన్నాయి. ఇవి కాక తెలంగాణ రాష్ట్ర పురావస్తుశాఖ పరిధిలో 346, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో 280, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ ప్రకటించిన 200 వరకు రక్షిత స్థలాలు, కట్టడాలు ఉన్నట్టు గుర్తించారు. సిబ్బంది కొరత, నిధులు లేమి కారణంగా వారసత్వ స్థలాలు, కట్టడాల నిర్వహణలో కనిపిస్తున్న ప్రధాన లోపం, కొద్దిపాటి చొరవ తీసుకుంటే కార్పొరేట్ సంస్థల భాగస్వామనయంతో సంరక్షణ, పరిరక్షణలో మెరుగైన నిర్వహణ పద్ధతులను అవలంభించవచ్చు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూసే బదులు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తే వారసత్వ ప్రదేశాలు, కట్టడాలు మనగలగడమే కాక భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

## ప్రపంచ వారసత్వ కట్టడాలను కాపాడుకోవడం అందరి బాధ్యత

ప్రపంచ వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడం ఎంతో ముఖ్యమైన బాధ్యత. ఇవి కేవలం పాత నిర్మాణాలు మాత్రమే కాదు, మానవ చరిత్ర, సంస్కృతి, విజ్ఞానం, కళల ప్రతిబింబాలు, అందువల్ల వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వారసత్వ కట్టడాలు కేవలం రాళ్లతో కట్టిన నిర్మాణాలు మానరతమే కావు. అవి మన పూర్వీకుల మేధస్సుకు, సంస్కృతికి, చరిత్రకు సజీవ సాక్ష్యాలు. వీటిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకు అనేక ప్రధాన కారణాలు కూడా ఉన్నాయి. ప్రపంచ వారసత్వ కట్టడాలు మన గతాన్ని తెలియజేస్తాయి. కొన్ని ప్రాచీన కట్టడాలు ఆయా దేశాల చరిత్రను ప్రతిబింబిస్తాయి. వీటి వల్ల చరిత్రను సంరక్షించుకోవచ్చు. ప్రతి దేశం ప్రత్యేకమైన సంస్కృతి కలిగి ఉంటుంది. ఈ కట్టడాలు ఆ సంస్కృతికి ప్రతీకలు. ఇవి నశిస్తే, మన సంప్రదాయాలు కూడా కనుమరుగవుతాయి. అటువంటి కట్టడాల వల్ల సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ చేయడానికి మార్గం సుగమమౌతుంది. విద్యా ప్రాముఖ్యతలో కూడా ఇవి ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు, పరిశోధకులు ఈ కట్టడాల ద్వారా చరిత్ర, వాస్తుశిల్పం, కళలు నేర్చుకుంటారు. ఇవి 'ప్రత్యక్ష పాఠశాలలు' అని చెప్పవచ్చు.

ప్రపంచ వారసత్వ ప్రదేశాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. వారసత్వ ప్రదేశాలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఆదాయం తెస్తాయి. ఆ కారణంగా ఇవి పర్యాటక అభివృద్ధికి దోహదపడతాయి. మనకు వచ్చిన ఈ విలువైన సంపదను భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందించడం మన బాధ్యత, కొన్ని వారసత్వ ప్రదేశాలు ప్రకృతి సంబంధిత (అడవులు, జలపాతాలు). వీటిని కాపాడడం ద్వారా ప్రకృతి సమతుల్యత నిలుస్తుంది. పర్యావరణ పరిరక్షణకు ఇవి దోహదపడతాయి. ప్రపంచ వారసత్వ కట్టడాలు మన 'గతం, వర్తమానం, భవిష్యత్తు'లను కలిపే బంధం లాంటివి. అందువల్ల వాటిని పరిరక్షించడం ప్రతి మనిషి కర్తవ్యం. ప్రపంచంలోని ఏ దేశంలో నైనా పురాతన వస్తువు, శాసనం బయటపడితే ఎంతో అపురూపంగా చూసుకుంటారు. దానిపై వెంటనే పరిశోధన చేసి చరిత్రను తవ్వి తీస్తారు. మన దగ్గర ఆ పరిస్థితి తక్కువగా ఉందనే చెప్పాలి. మెదక్ జిల్లాలోని మారేపల్లిలో కల్యాణీ చాళుక్యుల కాలం నాటిదని భావిస్తున్న శాసనమొకటి



బయటపడింది. దాన్ని గుర్తించిన స్థానికులు, కలెక్టర్ ద్వారా రాష్ట్ర పురావస్తు శాఖ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత ఆరేళ్లకు గానీ, దానిపై క్షేత్రస్థాయి పరిశోధన జరగలేదు. ఇదంతా ఒక ఎత్తైతే, చారిత్రక ప్రముఖులు, రచయితలు, వాగ్గేయకారులు, సంఘసంస్కర్తల గృహాలు కూడా పరిరక్షణకు నోచుకోకపోవటం తెలుగు జాతి దురదృష్టం. తెలుగు సంస్కృతిలో భాగమైన సంగీతం, సాహిత్య రంగాలకు జీవితాలను ధారపోసిన మహనీయుల నివాసాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించకపోవటమంటే వారసత్వ పరిరక్షణోద్యమానికి తూట్లు పొడవటమే.

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని కంచర్ల గోపన్న (రామదాసు), 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని తెలుగువారంతా గర్వపడేలా రాసిన దాశరథి గృహాలను రక్షిత కట్టడా లుగా ప్రకటించడంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం కోట సమీపంలో 'దేశమంటే మట్టికాదోయ్' అని చాటిన మహాకవి గురజాడ అప్పారావు ఇల్లు నేడు పైకప్పు పాడైపోయింది. ఆయన వాడిన వస్తువులు చెదలు పడుతున్నాయి. ఇదేవిధంగా రాజమహేంద్ర వరంలోని వంకాయలవారి వీధిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం నివసించిన ఇల్లు పెంకులు ఊడిపోయి, దూలాలు చెదలు పట్టిన సందర్భం కూడా ఉంది. విజయనగరం పర్లాకిమిడిలో వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి నివసించిన ఇల్లు గుర్తింపుకు నోచుకోలేదు. వీటితో ప్రపంచ వారసత్వ కట్టడాలకు ఎటువంటి సంబంధం లేదు. అయితే ఇటువంటి చిన్నవాటినే మన పరిరక్షించుకోకపోతే పెద్దకట్టడాలను వారసత్వ సంపదగా చరిత్రపుటల్లోకి ఎలా నమోదు చేయగలం? ఈ తరహా నిర్లక్ష్యమే జాతి ప్రభను మసకబారుస్తోంది. తెలుగు ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నిస్తే తప్ప పరిస్థితిలో మార్పు వచ్చే సూచనలు కనపడట్లేదు. ఇప్పటికైనా మేలుకోవాలి. ఇటువంటి వాటిని కూడా పరిరక్షణకు పూనుకోవాలి. ఈ నేపథ్యంలో అరుదైన మన చారిత్రక శిల్ప సంపదను వారసత్వ కట్టడాలుగా గుర్తింపు పొందడానికి కృషిచేయాలి.

## వారసత్వ ప్రదేశాల పరిరక్షణ భారత చట్టం

భారతదేశంలోని వారసత్వ ప్రదేశాలు 1958 నాటి ప్రాచీన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం ద్వారా రక్షణ కల్పిస్తున్నారు. దీనిని 2010లో సవరించారు. ఈ చట్టం ప్రకారం వారసత్వ ప్రదేశాలు, స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, శిల్పాలు ఇత్యాది వాటికి రక్షణ లభిస్తుంది. భారతదేశంలోని వారసత్వ ప్రదేశాల పరిరక్షణను సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేపడుతుంది.

వారసత్వ ప్రదేశాలు క్షీణతకు అనేక కారణాలు ఉన్నాయి. వాయు కాలుష్యం, మారుతున్న ఉష్ణోగ్రత, వరదలు, శిలీంధ్రం, నాచు.. ఇత్యాది జీవసంబంధ కారకాలు, భూగర్భ జలం, లవణాలు, ఖనిజాలు, సౌర వికిరణం, తేమ మొ॥ సహజ కారణాలు కూడా వారసత్వ ప్రదేశాలు క్షీణించడానికి కారణమౌతున్నాయి.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్, పదార్థం సరిగ్గా మండకపోవడం వల్ల సంభవిస్తున్న అగ్నిప్రమాదాలు, పట్టణీకరణ, విధ్వంసం మొ॥ మానవ జనిత కారణాలు కూడా వారసత్వ కట్టడాలు దెబ్బతినడానికి కారణమౌతున్నాయి. వారసత్వ కట్టడాల పరిరక్షణ కార్యకలాపాలను నిర్వహించడానికి కొన్ని సమస్యలు కూడా ఎదురౌతున్నాయి.

నైపుణ్యం, తగినంత మానవ వనరుల కొరత ఉంది. ఆధునిక, సంప్రదాయ ఇంజినీరింగ్ పద్ధతుల కొరత, వారసత్వ ప్రదేశాల విపత్తు పూర్వ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వక పోవడం, పరిరక్షణకు వివిధ రంగాల దృక్కోణాల నుండి ఇంజినీర్ల నైపుణ్యం అవసరం. (ప్రైవేట్ రంగం కేవలం బాహ్య నిర్వహణలో



మాత్రమే నిమగ్నమై ఉంది. నైపుణ్యం గల వనరుల లభ్యత లేకపోవడం వల్ల ముఖ్యమైన సమస్యలు పరిష్కరించబడటం లేదు.

## వారసత్వ సంరక్షణ-అమలు చేయగల పద్ధతులు

వారసత్వ సంరక్షణ కోసం ఉపయోగించే మూడు ప్రధాన పద్ధతులు ఉన్నాయి. వాటిలో మొదటిది: నిర్మాణ పరిరక్షణ. కాలక్రమేణా పునాది స్తంభాలు, కాలమ్‌లు, పైకప్పులు బలహీనపడటం, పాత భవనాలపై ఎక్కువగా కలుపు మొక్కల వంటి వృక్షసంపద పెరగడం, నీరు ఇంకడం వల్ల నిర్మాణం బలహీనపడటం ప్రారంభమవుతుంది. నిర్మాణ పరిరక్షణ పద్ధతిలో పునాదులపై పటిష్టపరిచే పనులు చేపట్టడం, గోడలు, పైకప్పులకు మరమ్మతులు చేయడం, భవనాల నుండి కలుపు



మొక్కలను తొలగించడం వంటివి చేస్తారు. రెండోది: రసాయన సంరక్షణ పద్ధతి. స్మారక చిహ్నాలను సేంద్రీయ వాయువుల నుండి రక్షిస్తుంది. పాచి వంటి వాటిని తొలగించడానికి సహాయపడుతుంది. మూడోది: అవగాహన కార్యక్రమం. భారతదేశం అంతటా సెమినార్లు, ఈవెంట్లు, వర్క్‌షాప్‌లను నిర్వహించడం, విధ్వంసాన్ని నివారించడానికి సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. మన రాజ్యాంగంలో సైతం ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలలో 'వారసత్వ సంపద పరిరక్షణ' అంతర్భాగంగా ఉంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ వారసత్వ ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా ప్రకటించి, ఆర్థిక వనరుగా మార్చే ప్రయత్నం చేస్తోంది. వారసత్వ కట్టడాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 2015 'హృదయ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతకు మునుపు దత్తత విధానంలో వాటి అభివృద్ధికి 'అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో స్మారక కట్టడాల అభివృద్ధికి కృషి చేయనున్నారు. మన పురాతన చారిత్రక కట్టడాలను దేశీయంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు వీక్షించే అవకాశం లేకుండా పోతున్నది. ప్రయాణం, వసతి ఖర్చులు భారీగా ఉండటమే దీనికి ప్రధాన కారణం.

అందువల్ల ప్రభుత్వాలు పథకాల ద్వారా స్మారక కట్టడాలను పేద ప్రజలు ఉచితంగా వీక్షించే అవకాశం కలించాలి. పురాతన కట్టడాలు శాస్త్రవేత్తలకు, చరిత్రకారులకు, ఇంజనీర్లకు గొప్ప పరిశోధనా కేంద్రాలు. అప్పట్లో ఎటువంటి ఆధునిక యంత్రాలు లేకుండా అంతటి భారీ నిర్మాణాలను ఎలా నిర్మించారో తెలుసుకోవడం నేటి ఆధునిక విజ్ఞానానికి కూడా ఎంతో సహాయపడుతుంది. మనం చూస్తున్న ఈ అద్భుతాలను మన పిల్లలు, వారి పిల్లలు కూడా చూడాలి. వారసత్వ సంపదను కాపాడటం అంటే, రాబోయే తరాలకు మనం ఇచ్చే అత్యంత విలువైన కానుక. వీటి ద్వారా వారు తమ సంస్కృతి పట్ల గర్వపడే అవకాశం కలుగుతుంది. ప్రపంచ వారసత్వ గుర్తింపు ఉన్న ప్రాంతాలను సందర్శించడానికి ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు వస్తారు. దీనివల్ల స్థానిక ప్రజలకు ఉపాధి లభిస్తుంది. దేశానికి విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. హోటళ్లు, రవాణా వంటి రంగాలు అభివృద్ధి చెందుతాయి. యునెస్కో వంటి సంస్థలు వీటిని 'మానవాళి అందరికీ చెందిన ఆస్తి'గా గుర్తిస్తాయి. ఇవి ఏ ఒక్క దేశానికో పరిమితం కావు. ఈ కట్టడాల పరిరక్షణలో వివిధ దేశాలు కలిసి పనిచేయడం వల్ల అంతర్జాతీయంగా సత్సంబంధాలు మెరుగుపడతాయి. అందుకే ప్రభుత్వం మాత్రమే కాకుండా, పౌరులుగా మనం కూడా ఈ కట్టడాలను సందర్శించినప్పుడు వాటిపై పేర్లు రాయకుండా, చెత్త వేయకుండా గౌరవంగా చూసుకోవాలి. మనదేశంలో ఎన్నో అపురూప కట్టడాలు ఆదరణ లేక కునారిల్లుతున్నాయి. ఆకాశ గోపురాలు నేలమట్టమవుతున్నాయి. బౌద్ధ, జైన మందిరాలు మట్టిగొట్టుకుపోతున్నాయి. తెలుగుజాతి గురుతులన్నీ చెరిగిపోతున్నాయి. పిచ్చిమొక్కలు, బండరాళ్లు, మట్టిదిబ్బలే మన వారసత్వ చిహ్నాలు కాబోతున్నాయి. కళ్లు తెరిచి కాపుగాయకుంటే ఇవి కనుమరుగౌతాయి. గతాన్ని మర్చిపోయిన వాడికి భవిష్యత్తు ఉండదు. చరిత్రను చిన్నచూపు చూసే వాడికి వర్తమానంలో విలువ దక్కదు. మూలాలను గుర్తుపెట్టుకుని, అస్తిత్వ చిహ్నాలను నిలుపుకునే జాతి కాలగమనంలో నిలబడుతుంది. సమున్నతంగా ఎదుగుతుంది. భారతదేశంతో పాటు ప్రపంచంలోని అనేక ప్రదేశాలు, నిర్మాణాలను యునెస్కోవారు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించి పరిరక్షించే చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ వారసత్వ సంపదను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

# ఈ వారం కవిత్వం

## స్వప్న సాకారం

కారుచీకటి ముసిరిన వేళ..
కనుపాపల కలలు కరిగిపోవు
కష్టాల కడలి ఉప్పెనైనా.. ఆశల
నావలు మునిగిపోవు
రాళ్ల బాటలు ఎదురైనప్పుడే.. కాలి
వేళ్ళకు పట్టుదల
పెరుగుతుంది
గాయపడిన
గుండె చప్పుడే..
గమ్యం వైపు
పరుగు
తీస్తుంది!
ఓటమి అనేది
ముగింపు కాదు..
అది ఒక కొత్త పాఠం
చీకటి అనేది శాశ్వతం కాదు..




అది వెలుగుకు ఆహ్వానం
సమస్యల సుడిగుండంలో..
ధైర్యం
నీకు
తోడుండాలి
సంకల్పపు అగ్ని
కీలల్లో..
నీ కల నిజమై తీరాలి!
ఎదురుగాలి వీచినా..
ఎగిరే పతంగివై పైకి
సాగు
అడ్డంకులు ఎదురైనా.. అలిసిపోని
సూర్యుడివై
ముందుకు సాగు

శ్రమ నీ ఆయుధమైతే..
విజయం నీ బానిసవుతుంది
నీ నిరంతర కృషి ఉంటే.. ఈ
లోకమే నీ పాదాక్రాంతమవుతుంది!
విధి రాసిన గీతలను..
నీ చెమట చుక్కతో తుడిచివేయి
నీలోని నివురు గప్పిన నిప్పును..
ప్రళయాగ్నిగా మార్చివేయి
స్వప్నం సాకారమయ్యే వరకు..
నిద్రను కూడా దరిచేరనీయకు
నీ గెలుపు పిలుపు వినే వరకు.. ఏ
క్షణమూ విశ్రమించకు!

– డా.చిట్యాల రవీందర్

## చివరి స్పర్శ

నీ కాటుక కన్నుల కవ్వింపులతోనే
కలకాలం కాలం గడపాలని
కాంక్షించాను.
కుదరదని కన్నెర్రజేసి నా కాంక్షను
భస్మీపటలం చేసావు.
నీ సుమధుర అధరముల
పలుకులతోనే
జీవితకాలం జీవించాలని ఆశపడ్డాను.
తగదని తాండవమాడి
నా ఆశను భూస్థాపితం చేసావు.
నీ సుకుమార తనువు తాకిడిలతోనే
జన్మాంతం తన్మయం
చెందాలని
తాపత్రయపడ్డాను.
జరగదని నికచ్చిగా నా
తాపత్రయాన్ని
దహింపచేసావు.
నీ చక్కని చరణముల
సవ్వడులతోనే
సుదూరకాలం శృతి
కలపాలని తహతహలాడాను.
నెరవేరదని కర్కశంగా నా
తహతహతను చెరిపేసావు.
అందుకే..



ఏమీ చేతగాక, ఎటూ
పాలుపోక
నిష్ప్రేష్టుడై, నిర్లిప్తుడై
శీతలీకరణ
బంధీఖానాలో నిర్జీవుడై
నీ ఎదుట సేదతీరాను.
ఇప్పుడు..
నీ చివరిస్పర్శ నా
తనువును స్పృశించినా
నేను గుర్తించలేను. అప్పటికే నేను
అందనంత అనంతకోటి
వాయువులలో కలిసిపోయాను.

– దేవీప్రసాద్ ఒబ్బు

## విరిసిన కొమ్మలలో వెలుగుల జీవనసవ్వడి..

ఆకాశపు అంచులను
తాకాలని ఆశ పడవు
నేల తల్లి ఒడిని వీడి..
ఎక్కడికీ
కదలవు.
కాలం కత్తులతో
గాయపరిచినా..
మౌనంగా
భరిస్తావు తప్ప..
ఎవరినీ నిందించవు.
నిలువెల్లా ఎండను నువ్వు భరిస్తూ
మాకు చల్లని వెన్నెల నీడనిస్తావు.
నీ చిగురుటాకుల సవ్వడిలో..
విశ్వకర్మ రాసిన వీణానాదం
వినిపిస్తుంది.



పండిన పండును కోసినా..
రాలిన ఆకును కాల్చినా..
మళ్ళీ కొత్త చిగురుతో
లోకానికి స్వాగతం చెబుతావు!
వేల పక్షులకు నువ్వే విడిది!
అలసిన బాటసారికి అమ్మ ఒడివి
ఏ ప్రతిఫలం ఆశించని నీ ఉనికి
మానవత్వానికే ఒక గొప్ప
పాఠం.నిశ్శబ్దంగా నిలబడి నువ్వు
నేర్పే సత్యం ఒక్కటే!
నీ దగ్గర ఉన్నది పంచుకోవడమే
పరమార్థం, నీవు ఇచ్చే ప్రేమే
నీ చిరకాల జ్ఞాపకం.
నీ త్యాగం.. ఓ మహా కావ్యం!

– డా.పూసపాటి వేదాద్రి

## దృక్కులు

సప్తవర్ణ శోభితం
ఆ ఇంటి దీపమైన ఇల్లాలు
సంద్రమున ఎగసిపడే అలలు
సహజం..
గృహసీమన కష్టాలు కడగండ్లు
సహజాతిసహజం.
దేవాలయంలో.. దైవభక్తిని చూడు
మానవుల్లో మంచిమమతను చూడు
పాలరాతి భవంతుల్లో
డబ్బు దస్కంచూడు..
పూరిపాకల్లో కల్మషం
లేనిమంచితనంచూడు
నిన్ను నువ్వు తరచిచూసుకో
వాస్తవిక దృష్టితో నడక సాగించు

– అంకాల సోమయ్య

# 'అక్షర శిల్పాలు'

సింగిల్ పేజీ కథ

అమ్మగారు వరండాలో కూర్చుని పాత పుస్తకాలు చూస్తున్నారు. వందలాది కథలు రాసిన సుప్రసిద్ధులు వారు. "పాత పేపర్లు, పుస్తకాలు కొంటాం" అంటూ ఒకడు ఇంటి ముందు ఆగాడు.

"ఎంత తీసుకుంటావ్?" అమ్మగారు అడిగారు. "పేపరు పది, పుస్తకాలు అయిదండీ!"

"మరోమాట చెప్పు. లేదంటే వెళ్లిపో!" "పేపరుకి పదిహేను, పుస్తకాలకు పది" అంటూ అన్నిటికీ తూకం వేసేసాడు. వాడిచ్చిన రెండు వందలు అమ్మగారు తీసుకున్నారు.

"రెండు చిన్న గదుల అద్దె కొంపలో, ఒక గది నిండా మీ పుస్తకాలే! ఎప్పుడోగాని వాటిని చూడరు. అవి అంత అవసరమా చెప్పండి?" వారు మౌనంగా పుస్తకాలను చూస్తున్నారు. "పదిహేను వేలకు ప్రత్యేకంగా చేయించిన స్టీలు బీరువాలో, ఇంకా పుస్తకాలు సర్దనే లేదు. ఇప్పుడు మరో అద్దె కొంపకు ప్రయాణం" అయ్యగారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. "ఆ పెద్ద బీరువా వద్దంటే విన్నారు కాదు. ఇప్పుడు సామాన్లకంటే జాగ్రత్తగా దానిని కొత్తింటికి తరలించాలి. ఎందుకొచ్చిన శ్రమ చెప్పండి. ఆ షాపు వాడికే ఓ వెయ్యి తగ్గించి ఇచ్చేయండి" ఏదైనా లైబ్రరీకి డొనేట్ చేయొచ్చు కదా?" వారు మాట్లాడలేదు.

"మీలాంటి సాహిత్య ప్రియులు అక్షరశిల్పులు చదువుకోడానికి అవకాశం కలిగిస్తే మంచిది కదండీ! అవసరమైన్పుడు మీరు లైబ్రరీకి వెళ్లి, మీ పుస్తకాలను చూసుకోవచ్చు కదా?" అయ్యగారికి పరిస్థితి అర్థమైంది...

లైబ్రరీ ప్రవేశ ద్వారం దగ్గరున్న పుస్తకంలో సంతకం చేసి లోపలకు వెళ్లారు అయ్యగారు. "నమస్కారం సార్!"

"నమస్తే! కొత్త పుస్తకాలు చాలా వచ్చాయి. తీసుకుంటారా?" "మీ నంబరు చెప్పండి"

"పుస్తకాలు డొనేట్ చేస్తానండీ!"

"తీసుకువచ్చారా?" అయ్యగారు వారిని బయటకు తీసుకువచ్చి, పుస్తకాలు చూపించారు. వ్యానులో వున్న పుస్తకాల దొంతరలను చూసి వారు ఆశ్చర్యపోయారు.



"నేను కొన్ని పుస్తకాలు అనుకున్నానండీ! ఇన్నింటిని నేనెక్కడ పెట్టుకోను?" అయ్యగారు ప్రాధేయపడ్డారు. అలా చూడండి సార్! ఇంకా విప్పని పార్సిల్సు నేలపై వున్నాయి. అవి పెట్టడానికే బీరువాలు లేవు" అయ్యగారు నిరుత్సాహంగా నిల్చున్నారు.

"నెల రోజుల తర్వాత తీసుకురండి. నాలుగు కొత్త బీరువాలు రానున్నాయి. వాటిలో ఒకటి తప్పకుండా మీ పుస్తకాలకు కేటాయిస్తాను. వచ్చేముందు ఫోను చేసి రండి!" అంటూ నంబరు రాసిచ్చారు లైబ్రీరియన్.

అయ్యగారికి తన కొత్త బీరువా గుర్తొచ్చింది. "నా పుస్తకాలకు ఈ రోజే కొత్త బీరువా ఏర్పాటు చేస్తాను. ఈలోగా పుస్తకాలను లోపల పెడదాం. కాదనకండి సార్!"

సరే! ఈ లోగా పుస్తకాలు చూస్తాను, ఫార్మాలిటీస్ పేపర్లు రెడీ చేస్తాను" వేను డ్రైవరు సహాయంతో అయ్యగారు పుస్తకాలు లోపల పెట్టించారు. "రేపు మంగళవారం సెలవు దినం. ఈ రోజు ఎనిమిదిలోగా కొత్త బీరువా తీసుకురావాలి. లైబ్రేరియన్ అంగీకరించడంతో హడావుడిగా అయ్యగారు బయల్దేరారు."పుస్తకాలు లైబ్రరీకి ఇచ్చేసారా?" తలూపారు అయ్యగారు. పక్కింటి వారి సహాయంతో బీరువాను వేనులోకి ఎక్కించారు అయ్యగారు. "షాపువాడికే ఇచ్చేస్తున్నారా?.. పధ్నాలుగు వేలు ఇస్తానన్నాడా?" అయ్యగారు మరల తలూపారు.

"హమ్మయ్య!.. రెండు సమస్యలు ఒకేసారి పరిష్కారం అయ్యాయి! అనుకుంటూ సంతోషించింది ఆమె. ట్రాఫిక్ జామ్ వలన వేను లైబ్రరీ దగ్గరకు వెళ్ళేసరికి ఎనిమిది దాటిపోయింది.

లైబ్రరీ మూసి వుంది. లైబ్రరియన్ బయట నిల్చున్నారు. "మూసేసి అరగంట దాటింది సార్! మీరు ఫోను చేసి చెప్పారు కాబట్టి మీ గురించి వున్నాను" "థేంక్సండీ! లైబ్రరీ తెరిస్తే బీరువా" అయ్యగారు చెప్పడం పూర్తికాలేదు. "రేపు సెలవు కనుక, బుధవారమే లైబ్రరీ తలుపులు తెరుచుకుంటాయి. వారి మాటలకు అయ్యగారి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. "మీరు శ్రమపడి వచ్చారు కాబట్టి, లైబ్రరీ తీసేదాకా, దగ్గరలో వున్న మా ఇంటిలో బీరువా వుంచండి. తర్వాత దానిని లైబ్రరీలో పెట్టిస్తాను" అయ్యగారు సంతోషంగా వారు చెప్పినట్లు చేసారు.

కొత్త ఇంటి పనులతో తీరిక లేక, పది రోజుల తర్వాత లైబ్రరీకి వెళ్లారు అయ్యగారు. హాలులోవారి బీరువా కనిపించలేదు. ఆశ్చర్యంగా లైబ్రరీయను వైపు చూసారు వారు. "మీరు బీరువా తెచ్చిన మూడో రోజే కొత్త బీరువాలు వచ్చాయండీ! మొదటి బీరువా తీసి చూడండి" లైబ్రేరియను చెప్పారు.

అయ్యగారు ఆ బీరువా తెరచి చూసారు. అన్ని అరలలో వారి పుస్తకాలు కనిపించాయి. అయ్యగారి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. "పక్కనున్న బీరువా కూడా చూడండి సార్!" ఆ బీరువాలో కూడా వారి పుస్తకాలే వుండడంతో, అయ్యగారు సంతోషించారు. పుస్తకాలను ఆప్యాయంగా స్పృశించారు.వారి కళ్ళు చెమ్మగిల్లాయి.. అనిర్వచనీయమైన అనుభూతి పొందుతున్నారు అల్పసంతోషి! తన శ్రీమతి కొత్త బీరువా ముచ్చట ఈ అక్షర శిల్పి ద్వారా తీరినందుకు లైబ్రేరియను మనసు ఆనందంతో గంతులు వేసింది.

– సుస్మితా రమణమూర్తి

# వేసవి సెలవులను ఎలా వినియోగించుకోవాలి?

పది మాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాక కోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి.



ఊపిరాడనంతగా ఒకే రకమైన యాంత్రిక జీవనశైలి గడిపిన విద్యార్థులు విద్యాలయ దిన చర్యకు దూరం జరిగి వేసవి సెలవుల్లో కొన్ని వారాల పాటు విశ్రాంతి, వినోద విరామాలను పొందుతూనే తమకు నచ్చిన పసందైన కార్యక్రమాలకు ప్రాణం పోసేందుకు యువత ఉవ్విళ్లూరుతూ ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో స్వేచ్ఛగా, సరదాగా గడపడానికి వేదికలుగా వేసవి సెలవులు ఉపయోగపడతాయి. హోమం వర్క్, పరీక్షలు, తీరిక ఇవ్వని అకడమిక్ కార్యక్రమాలు, నోట్స్ రాయడం, బడి గంటలకు దూరంగా తమకు నచ్చిన రీతిలో వేసవి సెలవులు గడపడానికి పిల్లలు పథకాలు వేస్తూ ఉంటారు.

మానసిక ఒత్తిడి నుంచి బయటపడి తమ అభిరుచులు, ఆసక్తి కలిగిన పనులు, ఆటపాటలు, ఆన్‌లైన్‌లో మునకలు, సినిమాలు, పర్యాటక ప్రయాణాలు, క్రీడా ప్రాంగణాలకు పరుగులు, అమ్మ చేతి వంట రుచులు, దర్శనీయ స్థలాల పయనాలు, వినోద విజ్ఞాన వేదికలు, ఆరోగ్యం కాపాడుకునే కార్యాలు, మానసిక ఉల్లాస విందులు, సృజన/విలక్షణ ఆలోచనలు, తమకు నచ్చిన ఫైన్ ఆర్ట్స్‌లో శిక్షణల కోరికలు లాంటి అనేక ప్రణాళికలను నిజం చేసుకునే సమయంగా వేసవి సెలవులు ఉపకరిస్తాయి.

### వినోద, విరామ, పునరుత్తేజ కార్యక్రమాలు

అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాలకు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/ జూ/ సర్కస్ /ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి. కొత్త ప్రదేశాలు, ప్రకృతి సహజ అందాల ఆస్వాదనలు, సాహస క్రీడలు, ప్రకృతిలో దాగిన అద్భుతాల ఆవిష్కరణలు, ఈత నేర్చుకోవడం, సైక్లింగ్ లేదా బైక్ నేర్చుకోవడం, మనకు నచ్చిన అభిరుచులను పెంచి పోషించుకోవడం, కుటుంబ సభ్యులతో సరదాగా గడపడం, అమ్మ ఒడిలో తల వాల్చడం, నాన్న చేయి వదలక ముందడుగు వేయడం, సామాజిక సంబంధాలను పటిష్ట పరుచుకోవడం, మానవ సంబంధాలను పెంచుకోవడం, సహకార భావనలతో పది మందితో కలిసి పని చేయడం లాంటి పలు కార్యక్రమాలకు వేసవి సెలవులు నెలవులు కావాలి. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం లేదా హాజరు కావడం, వేసవిలో పార్ట్ టైమ్ విద్య సంబంధ ఉద్యోగాలు చేయడం, ప్రయాణాలు చేస్తూ వినోద విజ్ఞానాలను పెంచుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో గడపడం లాంటివి పిల్లల వ్యక్తిత్వాలను, అవగాహన శక్తులను మెరుగు పరుచుతాయి.

### ఆధునిక డిజిటల్ కాలపు నైపుణ్య వికాస కార్యక్రమాలు

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవపోసన పట్టడం, సంగీతం/ నాట్యం/ పేయింటింగ్ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/ వ్యాస రచన/ కథలు రాయడంతో సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి వేసవి



సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్జి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యం పోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నైపుణ్యాలు, విజ్ఞానం, సామర్థ్యాలకు పదును పెట్టడం లాంటివి మరువరాదు. సృజనశీల అంశాల్లో అడుగు పెట్టడంతో పాటు ఇన్నొవేటివ్ ఆలోచనలు చేయడం మన పిల్లల శారీరక మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడతాయి.

## ఆరోగ్య పరిరక్షణ నవ్య జీవనశైలి కార్యక్రమాలు

నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం/ యోగా/ ప్రాణాయామం / వాకింగ్/ స్విమ్మింగ్/ ట్రెక్కింగ్/ మోంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు. వీటికి తోడుగా తోట పనుల్లో నిమగ్నం కావడం, పర్యావరణ పరిరక్షణ సేవలు, నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, శ్రమదాన కార్యక్రమాలు చేయడం, అనాథాశ్రమాలను సందర్శించి వారికి చేతనైనంత తోడ్పాటు ఇవ్వడం, నేచర్ ట్రెజర్ హంట్ చేయడం, ఇష్ట దైవానికి పూజ చేయడం, దేవాలయాలు లేదా ప్రార్థనా స్థలాలను సందర్శించడం లాంటివి చేయడం ఉత్తమం అని భావించాలి.

> – పరాజయం పొందిన సైన్యానికి ఉండే బాధల్లో సగం బాధలు విజేతలకు కూడా ఉంటాయి.



## చేయగూడని కార్యక్రమాలు – తల్లితండ్రుల పాత్ర

పిల్లలు వేసవి సెలవులను సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా గడపడంలో తల్లితండ్రుల పాత్ర అధికమని గమనించాలి. వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. అధిక కాలం పాటు స్మార్ట్ ఫోన్ వాడడం లేదా టివీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. కరోనా లాక్‌డౌన్ వల్ల పిల్లలు స్మార్ట్ ఫోన్ బానిసలుగా మారడం చూసాం. ఆన్‌లైన్ గేమ్స్‌కు బదులుగా అవుట్/ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. వేసవి ఎండలను గమనిస్తూ, గంటల తరబడి మైదానాల్లో ఆడకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతి నిద్ర లేదా అతిగా తినడం లేదా అతి గారాబానికి ఆస్కారం ఇవ్వకండి. డ్యాన్స్, ఫైన్ ఆర్ట్స్, స్విమ్మింగ్, సైక్లింగ్, మ్యూజిక్, ఆటలు లాంటివి నేర్పించండి.

వేసవి సెలవులు పూర్తి స్వేచ్ఛకు సెలవులు కావని, వినోదంతో పాటు విజ్ఞానం, ఆటపాటలతో పాటు శారీరక మానసిక వికాసం, ఆన్‌లైన్‌లో సంచరిస్తూ దురలవాట్ల కోరల్లో పడకుండా రేపటి బాధ్యత కలిగిన పౌరులుగా మారడానికి నేటి పిల్లలకు వేసవి సెలవులు ఉపయుక్తం కావాలని కోరుకుందాం. పిల్లల అభిరుచులను గమనిస్తూ వేసవి సెలవుల్లో వారి వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞానవంతులుగా మారడానికి తల్లితండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. వేసవి సెలవులను వ్యర్థం చేయవద్దు. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వడ్డించే నెలవుగా మారాలని కోరుకుందాం.

**– డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**

# తెలిసుండాలి!

**ఒక గురువు... ఇద్దరు యువ శిష్యులు ఆయన ఎదుట కూర్చున్నారు. గురువు పాఠం చెప్తున్నారు.. శిష్యులకు చాలా కాలంగా ఒక ఆశ.**

అదేమిటంటే, ఒ ముఖ్యమైన మంత్రాన్ని తమ గురువుగారి వద్ద నేర్చుకోవాలన్నదే ఆ ఆశ.

అదేం మంత్రం అంటే... మరణించిన వారిని బతికించే శక్తిమంతమైన పవిత్ర మంత్రం.

"గురువుగారూ, మరణించిన వారికి మళ్ళీ ఊపిరి పోసే మంత్రాన్ని మాకు ఉపదేశించండి. దయచేసి కరుణించండి" అన్నారు శిష్యులు ఒక్క మాటగా.

"అది ప్రమాదకర మైనది... అయినా ఆ మంత్రం మీకెందుకు?" అని అడిగారు గురువుగారు.

"మా నమ్మకాన్ని దృఢ పరచుకోవడానికి అడుగుతున్నాం గురువుగారూ!" అని చెప్పారు శిష్యులు.

అయితే గురువుగారు "పరిపక్వత లేని జ్ఞానం ప్రమాదకరం" అని గురువుగారన్నారు.

అది శిష్యులకు అర్థం కాలేదు.

"పరిపక్వత లేని జ్ఞానం ప్రమాదకరమా? అదెలా? అని అడిగారు శిష్యులు. మీరు చెప్పిన మాట అర్థం కాలేదు. కాస్తంత విడమరిచి చెప్తారా?" అని ప్రశ్నించారు. గురువుగారు "ఆ మంత్రాన్ని ఎప్పుడు ప్రయోగించాలో అనే పరిపక్వత తెలిసేంతవరకూ అది తెలుసుకోకుండా ఉండటమే మంచిది" అని గురువుగారు చెప్పారు.

కానీ శిష్యులు తమ పట్టు వదలలేదు. "తమకు చెప్పి తీరాల్సిందే" అన్నారు.

"సరే! చెప్తాను అని అన్నారు గురువుగారు. గురువుగారు వారిద్దరికీ రహస్యంగా చెప్పారు మంత్రాన్ని.

వారికి ఉపదేశించడమే కాకుండా హెచ్చరిక కూడా చేశారు. "ఈ మంత్రాన్ని బాగా పరిశోధించి చూసిన తర్వాతే ఉచ్చరించాలని చెప్పారు. అంతేతప్ప తొందరపడి చెప్పకూడదు అని అన్నారు. మంత్రాన్ని చెప్పాలనుకున్నప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించాలన్నారు"

శిష్యులు "అలాగే" అని అక్కడి నుంచి వెళ్ళిపోయారు ఆనందంగా. ఒకరోజు ఆ శిష్యులిద్దరూ నడుచుకుంచూ పోతున్నారు. ఒకచోట వారికి ఎముకలు కుప్పగా పడి ఉండటం కనిపించింది. వెంటనే



వారు ముందు–వెనుకలు ఆలోచించకుండా, ధ్యానమూ చేయకుండా మంత్రశక్తిని పరీక్షించాలనుకున్నారు. గురువుగారు చెప్పిన మంత్రాన్ని ఉచ్చరించారు. మరుక్షణం.. ఆ ఎముకలన్నీ కలిసి రెండు తోడేళ్ళుగా మారాయి. తోడేళ్ళు వారిద్దరినీ వెంటపడి తరిమాయి. శిష్యులు కుయ్యో మొర్రో అంటూ కిందా మీదా పడి పరిగెత్తారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిగెత్తుతున్నారు.

అయినా తోడేళ్ళు వారిని విడవలేదు. వారి వెంట పడ్డాయి. ఇద్దరినీ పట్టుకుని కరిచాయి.

అప్పుడు ఆ శిష్యులకు గురువుగారు చేసిన హెచ్చరిక అర్థమైంది. పరిపక్వత లేని జ్ఞానం ప్రమాదకరం అని గ్రహించారు. మొత్తం మీద ఎలాగోలా తప్పించుకుని గాయాలతో బతుకు జీవుడా! అని ఆశ్రమానికి చేరుకుని జరిగినదంతా గురువుగారికి చెప్పారు.

ఈ సంఘటన నుంచి మనం తెలుసుకోవలసింది ఏమిటంటే– మనం జ్ఞానాన్ని పెంపొందించు కున్నంత మాత్రాన సరిపోదు. తెలిసిన విషయాన్ని ఎప్పుడు ఎలా ఉపయోగించాలో తెలిసుండాలి. అప్పుడే జీవితం హాయిగా ఉంటుంది. లేకుంటే అధోగతే. ఈ కాలంలో కొందరు చిన్న పిల్లలకే బోలెడన్ని తెలివితేటలు ఉండటం చూస్తూ ఉంటాం. వారి మాటలు కూడా సామాన్యమైనవి కావు. వారితో వాదించలేం.

.........

ఓ కుర్రాడికి స్కూల్లో ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారు. అది తీసుకుని త్వరత్వరగా ఇంటికి వెళ్తున్నాడు. కొంత దూరం వెళ్ళేసరికి ఎదురుగుండా ఒక వ్యక్తి వస్తున్నారు. "బాబూ, ఎందుకు అంత వేగంగా పోతున్నావు?" అని అడిగారాయన కుర్రాడిని. "మా అమ్మ దగ్గర దెబ్బలు తినాలి... అందుకే వేగంగా పోతున్నాను" అని జవాబిచ్చాడు కుర్రాడు.

"అదేంటీ? దెబ్బలు తినడానికి అంత వేగంగా వెళ్ళాలా?" అని ఆ వ్యక్తి అడిగాడు ఆశ్చర్యంగా.

"మీరనుకున్నట్లు కాదండీ! నేను వెళ్ళేలోపు మా నాన్నగానీ ఇంటికి వచ్చేసారంటే ఆయన దగ్గర దెబ్బలు తినాలి. ఆయన కొట్టే దెబ్బలు తినడం కన్నా అమ్మ దగ్గర కొట్టించుకోవడం మేలు. ఎంతైనా అమ్మ అమ్మే కదండీ. బలంగా కొట్టదండి. అంతేకాదు, తర్వాత నాన్నతో తన్నులు తినకుండా అడ్డుపడుతుంది. అందుకే నేను వేగంగా ఇంటికి పోతున్నాను" అన్నాడు కుర్రాడు.

– యామిజాల జగదీశ్

కథ

# పావురాల ప్రయత్నం

సుందరవనమనే అడవిలోకి ఒక పక్షుల వేటగాడు ప్రవేశించి ఒక వలను పరిచాడు. అతడు వాటి కోసం అక్కడ కొన్ని ధాన్యపు గింజలను చల్లాడు. తర్వాత అతడు కొద్దిసేపు అయిన తర్వాత తిరిగి వద్దామని అక్కడి నుండి వెళ్లిపోయాడు. ఇంతలో ఒక చిట్టి పావురం తమ గుంపులోని అనుభవం కలిగిన ముసలి పావురాలు చెప్పినా వినకుండా వచ్చి ఆ వలలో చిక్కింది. ఆ పావురాలు దానిని చూసి "అయ్యో పాపం! ఇది వేటగాని వలలో చిక్కింది. దీన్ని ఎలాగైనా విడిపించాలి" అని అనుకొని తమ నేస్తమైన ఎలుక కోసం పరిగెత్తాయి. కానీ ఆ సమయంలో వాటి నేస్తమైన ఎలుక ఆ కన్నంలో లేదు. "ఇప్పుడెలాగా! ఆ వేటగాడు తిరిగి వచ్చే సమయమైంది. ఈ ఎలుక ఉంటే అది ఆ వలతాళ్లు కొరికి దానిని కాపాడేది" అని అవి చింతించాయి. అప్పుడు వాటికి ఒక చిలుక కనిపించింది. అది ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించింది. అప్పుడు ఆ పావురాలు దానికి చిట్టి పావురం వలలో చిక్కిన సంగతి తెలిపాయి. ఆ చిలుక వాటితో "ఓ పావురాల్లారా! మన ప్రయత్నం మనం చేయాలి. ఆందోళన చెందితే ఎలా! ఈ సమీపంలోనే నా నేస్తం కోతి ఉంది. అది మీకు సాయం చేస్తుంది" అని అంది.



అవి సంతోషంతో దానిని కోతి నివాసానికి తమ తోడుగా రమ్మన్నాయి. అది సరేనంది. అవి అన్నీ కలిసి చిలుక నేస్తమైన కోతి వద్దకు వెళ్లాయి. ఆ కోతి కూడా అక్కడ లేదు. "అయ్యో! ఇప్పుడు దాన్ని ఆ వల నుండి ఎలా విడిపించాలి? వేటగాడు వచ్చే సమయం అయింది" అని అనుకుంటూ అవన్నీ ఆ చిట్టి పావురం ఉన్న వైపు చిలుకతో సహా నిరాశతో వచ్చాయి.

ఇంతలో దూరం నుండి ఆ వేటగాడు వస్తూ వాటికి కనిపించాడు. అప్పుడు అవి "అయ్యో! మనం గుంపుగా ఉండి కూడా దానికి ఏమీ సాయం చేయలేకపోయామే? ఇతడు దీన్ని ఎలాగైనా పట్టుకొని పోతాడు. ఇతడు మరి కొంచెం ఆలస్యంగా వస్తే బాగుండేది. ఆ లోపల ఆ కోతి, ఎలుక వచ్చేవి కదా! మనం చేసిన ప్రయత్నమంతా వ్యర్థమేనా!" అని అవి బాధపడ్డాయి. ఇంతలో అతను రానే వచ్చాడు. ఆ వలలో చిక్కిన పావురం ఎంతో భయపడింది. కానీ ఆ పావురం అదృష్టం కొద్దీ అతడు పక్షుల వేటగాడు కాదు. పక్షి ప్రేమికుడు. అతనికి వలలో చిక్కిన ఆ పావురం కనిపించింది. వెంటనే అతడు ఆ వలను తీసి ఆ పావురాన్ని వల నుండి తప్పించాడు. ఆ పావురం వల నుండి విముక్తి పొంది సంతోషంతో తన తోటి పావురాల వద్దకు వెళ్ళింది. అప్పుడు ఆ పావురాలు "ఆహా! ఈ పావురానిది ఎంత అదృష్టం. మనం ఇతడు వేటగాడు అని భ్రమపడ్డాం. మనం చేసిన ప్రయత్నం వ్యర్థం కాలేదు. మనకు మంచి ఫలితమే వచ్చింది. అందుకే పెద్దలు అన్నట్లు మన ప్రయత్నం మనం చేయాలి" అని ఆ పావురంతో పాటు అవి తమ ప్రయత్నానికి సాయపడిన ఆ చిలుకకు ధన్యవాదాలు చెప్పి సంతోషంతో అక్కడినుండి ఎగిరిపోయాయి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
ధర్మపురి



వార్త ఆదివారం

# బాలగేయం

## పచ్చని చెట్లు

పచ్చ పచ్చని చెట్లు
కాలుష్యం పీల్చే చెట్లు
విశ్వాన్ని కాపాడే చెట్లు
ప్రగతికివియే మెట్లు
ప్రకృతికందం చెట్లు
చల్లని నీడనిచ్చే చెట్లు
ఫలములు పంచే చెట్లు
జగానికి ఊపిరి చెట్లు
పక్షుల నివాసం చెట్లు
ప్రగతికి మూలం చెట్లు.

చెట్లు లేక వాయువు లేదు
చెట్లు లేక జీవం లేదు
కలపనిచ్చేవి చెట్లు
బొగ్గుగా మారు చెట్లు
బొగ్గు బూడిదయ్యేవి చెట్లు
చచ్చినా పరోపకారులు చెట్లు.

చల్లగాలి నిచ్చేవి చెట్లు
వర్షాన్ని పిలిచేవి చెట్లు
భువి లేకపోతే చెట్లు
పర్యావరణానికి తూట్లు
ఔషధ గనులు చెట్లు
నరకవద్దు చెట్లు
అమ్మ పేరుతో నాటు చెట్లు

– షేక్ సుమయ్య

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**బి.శశికాంత్, పరిగి**

ప్రశ్న: వెంట్రుకలను, గోళ్లను కత్తిరించినప్పుడు మనకు నొప్పి కలగపోవడానికి కారణం?

**జవాబు:** వెంట్రుకలు, గోళ్లకు రక్తనాళాలతోగానీ, మృదులాస్థితో గానీ సంబంధం ఉండదు. అలాగే వీటిలో రక్తనాళాలు ఉండవు. కాబట్టి రక్తప్రసరణ వ్యవస్థ ఉండదు. అందువల్లే వీటిని కత్తిరించినప్పుడు మన నాడీ వ్యవస్థ ప్రభావితం కాదు. నొప్పి అనే భావన మన మెదడు గ్రహించదు. గోళ్ల మృతకణాలతో నిండి వున్న కెరటిన్ అనే ప్రత్యేక పదార్థంతో తయారవుతాయి. గోళ్లను, వెంట్రుకలను పైపైన కత్తిరించకుండా గట్టిగా లాగితే నొప్పి కలుగు తుంది. కంటికి కనబడే వెంట్రుక భాగాన్ని హెయిర్ షాఫ్ట్ అంటారు. చర్మం లోపల డెర్మిస్ అనే భాగంలో ఉన్న హెయిర్ ఫోలికల్ నుంచి వెంట్రుక పెరగడం మొదలవుతుంది. డెర్మిస్ నరాలతోనూ, రక్తనాళాలతోనూ, రకరకాల కణజాలాల నిండి ఉండడం చేత వెంట్రుకను బలవంతంగా లాగితే నొప్పి కలిగి అది నాడీవ్యవస్థ ద్వారా మెదడుకు అందుతుంది. గోళ్ల మొదటి భాగాలు కూడా చర్మానికి అతుక్కుని ఉండడం వల్ల వాటిని చివర్లలో తప్ప కొంచెం లోపల నుంచి తీసినా బాధ కలుగుతుంది.

**కె.ఫణి, కొత్తకోట**

ప్రశ్న: వజ్రాలను ఎందుకు సానబెడతారు?

**జవాబు:** ముడి స్థాయిలో ఉన్నప్పుడు సాధారణ గాజుముక్క మాదిరిగా కనిపించే వజ్రం కళ్లు మిరుమిట్లు గొలపాలంటే సాన పెట్టవలసిందే. వజ్రానికి చెందిన వివిధ ముఖాల నుంచి కాంతిపుంజాలు విరజిమ్మటానికీ, వివిధ రంగులు కనువిందు చేయటానికీ ఇదే కారణం. ఒక వజ్రం ఇష్టపడే ఆకారం అనేది వ్యక్తిగత అభిరుచుల మీద ఆధారపడి ఉయింది.





**శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా శైవాలయాలకు నిలయంగా విరాలజిల్లుతోంది. ఈ నియోజకవర్గంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉన్న అతిపురాతనమైన ఆలయం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయం.**

**మొదటిసారి మహాకుంబాభిషేకం ఈ నెల 19 నుంచి ప్రారంభం..**

ఈ ఆలయం ఎంతో కాలం నిర్లక్ష్యానికి గురైంది. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం దృష్టికి ఈ ఆకట్టుకుంటోంది.

## మొదటి శివాలయం

భారత దేశంలోనే మొదటి శివాలయంగా గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయం ప్రసిద్ధి చెందింది.

పరశురామేశ్వరాలయంగా పిలుస్తారు. ఇది ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది.

## అతిప్రాచీనం

పురావస్తు శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ గుడిలోని శివలింగం క్రీ.పూ. ఒకటి లేదా రెండో శతాబ్దం నాటిది. అయితే దీన్ని ఎవరు ప్రతిష్టించారనే విషయం మాత్రం కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. గుడిమల్లంలోని శివాలయం ఉనికిని మొట్టమొదట బ్రిటీష్ ప్రభుత్వం 1910లో గుర్తించింది.

ఆలయ నిర్మాణ శైలిని బట్టి దీన్ని శాతవాహనులు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయ తవ్వకాల్లో లభించిన ఒక శాసనం ప్రకారం పన్నెండో శతాబ్దం విక్రమాదిత్య చోళుడి కాలంలో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు.

# అరుదైన శివలింగం

ఆలయ చరిత్రను తీసుకురావటంతో స్థానిక శాసనసభ్యుడు చొరవ చూపారు. ఈ ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమించింది.

ఈ ఆలయానికి సంబంధించి కుంబాభిషేకం ఎప్పుడు జరిగిందో తెలియదు కానీ సుమారు 40 సంవత్సరాల క్రితం ఆలయంలో అగ్ని ప్రమాదం జరిగింది. తరువాత కుంబాభిషేకం జరగలేదు. మొదటిసారి ఈ తరం చూసేటట్లు కుంబాభిషేకం నిర్వహిస్తున్నారు. ఒకనాడు దారి తెన్నులు లేని ఆలయానికి నేడు అద్భుతమైన సిమెంటురోడ్డు వేయించారు.

ఓ వైపు ప్రభుత్వం మరో వైపు తిరుపతి కార్పొరేషన్ సహకారం అందరి కన్నా కలెక్టర్ చొరవతో ఆలయానికి చక్కని రోడ్లు వచ్చాయి. రవాణా సౌకర్యాలు అభివృద్ధి చేసారు. ఒకనాడు భక్తుల కోసం ఎదురు చూసిన ఆలయం ఇప్పుడు భక్తజనంతో కళకళ లాడుతోంది. భారతదేశం నుంచే కాకుండా విదేశాల నుంచి వచ్చే భక్తులను

ఆ దేవాలయం మన వాస్తుశాస్త్ర నియమాలకు విరుద్ధంగా పశ్చిమాభిముఖంగా ఉంటుంది. ఈ శివలింగం పురుషాంగాన్ని పోలి వుండడం మరో విశేషం. క్రీ.పూ. రెండో శతాబ్దం ప్రాంతంలో నిర్మించినట్లుగా చెబుతున్న ఈ ఆలయం తిరుపతికి సమీపంలో ఉంది.

గుడిమల్లంలోని ఈ శివాలయం అనేక విశేషాలకు నిలయం. జిల్లాలోని పూసల పరిశ్రమకు ప్రఖ్యాతి గాంచిన పాపానాయుడు పేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో.. శ్రీకాళహస్తికి 29 కిలోమీటర్ల దూరంలో గుడిమల్లం గ్రామం ఉంది. ఇక్కడి దేవాలయాన్ని



## ప్రపంచంలో ఎక్కడా లేని శివలింగం

సాధారణంగా శివుని ఆలయాల్లో శివలం లింగాకారంలోనో అర్ధనారీశ్వరుడిగానో, నటరాజుగానో చూస్తాం. కానీ.. గుడిమల్లంలోని శివలింగం మాత్రం విచిత్రంగా ఉంటుంది. పురుషాంగాన్ని పోలిన ఈ రూపం మరెక్కడా కనిపించదు. ఒకటిన్నర మీటర్ల పొడవున్న ఈ లింగం అష్టధాతువులతో ఏర్పడినట్లు తెలుస్తోంది.

## శివలింగం ప్రత్యేకత

ఇక్కడ వెలసిన శివలింగంలో రాక్షసుడి భుజాలపై నిల్చున్నట్లున్న శివుడు, కుడిచేతిలో జింక (సారంగపాణి), ఎడమచేతిలో భిక్షపాత్ర, భుజంపై గండ్రగొడ్డలి, చెవులకు కుండలాలు, ముంజేతికి కడియాలు, మొలకు ధోవతి, తలకు లేత తాటికాయల కిరీటం కనిపిస్తాయి. కానీ, యజ్ఞోపవీతం లేదు. ఇది మంగోలులను పోలిన

రూపం కావడం విశేషం. ఈ లింగాన్ని ముఖలింగం అని కూడా వ్యవహరిస్తారు. శివుడి చేతిలో ఉన్న గొడ్డలిని బట్టి ఈ ఆలయానికి పరశురామేశ్వరాలయం అని పేరు వచ్చింది. ఉజ్జయిని తవ్వకాల్లో క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన రాగినాణేలు లభించాయి. వాటిపై గుడిమల్లంలోని శివలింగాన్ని పోలిన చిత్రాన్ని కనుగొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర మ్యూజియంలో భద్రపరచిన క్రీ.పూ. ఒకటో శతాబ్దానికి చెందిన లింగం గుడిమల్లంలోని శివలింగాన్ని పోలి ఉండడం విశేషం.

పురావస్తుశాఖ 1973లో ఈ దేవాలయంలో తవ్వకాలు సాగించారు. అప్పుడు గర్భాలయంలో శివలింగం పురాతన అవశేషాలున్న దిబ్బపై దొరికినట్లు తెలిసింది. ఇక్కడి పరిసరాల్లో క్రీ.పూ 2 లేదా 3 శతాబ్దాలకు చెందిన మృణ్మయ పాత్రలు నలుపు ఎరుపు రంగుల్లో లభించాయి. శాతవాహనుల కాలం నాటి మెరిసే పాత్రల అవశేషాలు, పెద్ద సైజు ఇటుకలు అనేకం లభించాయి.

## గుడిమల్లం కాదు..గుడిపల్లం

సాధారణంగా అన్ని ఆలయాలు తూర్పు ముఖంగా ఉంటాయి. కానీ, దీన్ని మాత్రం పశ్చిమాభిముఖంగా నిర్మించారు. అంతేకాదు, ఇటీవలి కాలంలో ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న దేవాలయ నిర్మాణం రెండు దశలుగా సాగింది. గర్భాలయం పైకప్పు గజ పృష్ఠాకారంలో అంటే ఏనుగు వెనుక భాగాన్ని పోలి ఉంటుంది. పల్లవుల కాలానికి చెందిన గుడి కనుక దీన్ని గుడిపల్లం అని పిలిచేవారట. గర్భగుడి పల్లంలో ఉండడం చేత గుడిపల్లం అనేవారని, కాలక్రమంలో ఇది 'గుడిమల్లం'గా మారిందని చెబుతారు. చివరికి ఊరిపేరును కూడా ఈ ఆలయం పేరు మీదే గుడిమల్లంగా పిలుస్తున్నారు.



ఆలయంలో లభించిన శాసనాల్లో మాత్రం ఈ పేరుకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేదు. చోళరాజుల శాసనం ప్రకారం.. ఈ గ్రామాన్ని 'తిరువిప్పురమ్‌బేడు' అనే తమిళ పేరుతో పిలిచేవారు. అంటే తెలుగులో 'శ్రీవిప్ర పీఠం' అని అర్థం. దీన్ని బట్టి ఆ కాలంలో ఈ గ్రామం బ్రాహ్మణ అగ్రహారం కావొచ్చని తెలుస్తోంది.

దేవాలయం నిర్మాణం రెండో దశ చోళుల హయాంలో జరిగింది. గర్భగుడికి ప్రదక్షిణ సౌకర్యం కల్పిస్తూ మండపాలు, అంతరాళం, కుడ్యాలంకారాలతో నిర్మించారు. పడమటివైపు ప్రవేశ గోపుర ద్వారం, ప్రాంగణంలో పరివార దేవతలకు చిన్న చిన్న గుళ్లు నిర్మించారు. ఇందులో సూర్యుడు, కార్తికేయుడు, దేవీ విగ్రహాలు ఉన్నాయి. అన్నింటినీ కలుపుతూ ప్రాకార నిర్మాణం జరిగింది.

స్వామివారి అభిషేకానికి యాదవ రాజుల కాలంలో క్రీ.శ.1346లో బావిని తవ్వించినట్లు తెలుస్తోంది.

క్రీ.శ.8వ శతాబ్దం నుంచి ఈ ఆలయంలో పూజాదికాలు జరిగినట్లు పురావస్తు శాస్త్రవేత్తల అంచనా. ప్రస్తుతం ఆలయంలో నిత్యం ధూప-దీప నైవేద్యాలు, స్వామివారికి అభిషేకాలు జరుగుతున్నాయి. తిరుపతి నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడిమల్లం చేరుకునేందుకు ఆర్టీసి బస్సులు ఉన్నాయి. ఈ ఆలయం దేశంలోనే అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటిగా పేర్కొనబడుతోంది. ఇప్పుడిప్పుడే ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

**- మోహన్‌రాజు**

---




### దురద

"మీకు కొలెస్ట్రాల్ చాలా ఎక్కువగా ఉంది" అన్నాడు పేషెంట్‌తో, డాక్టర్.

"అయితే కొలెస్ట్రాల్ తగ్గిన తరువాత మీ దగ్గరికి మళ్లీ వస్తాను" అని వెళ్లిపోయాడు.

ఇంకేముంది.. డాక్టర్ స్పృహ తప్పి పడిపోయాడు.

### చాలామంది

"ఈ రోజు నుండి ఇంటి అద్దె ఐదు వందలు పెంచుతున్నాను" అన్నాడు ఇంటి యజమాని, రవితో.

"ఎందుకు?" అడిగాడు రవి.

"నిన్ను కలవడానికి రోజూ చాలా మంది వచ్చి హాల్లో వెయిట్ చేస్తున్నారుగా! అందుకని".

### నిలబెట్టొద్దన్నారుగా..

భార్యా భర్తలు షాపింగ్‌కు వెళ్లారు బైక్ మీద. షాప్ దగ్గరికి వెళ్లాక బైక్‌ని పడుకోబెట్టాడు భర్త.

"ఎందుకండీ బైక్‌ను పడుకోబెట్టారు?" అడిగింది.

"ఇక్కడ వాహనాలు నిలుపరాదు" అని బోర్డు పెట్టారుగా.. అందుకే పడుకోబెట్టాను".

**- వైదా ఈశ్వరరావు,**
విశాఖ


**సీతారామపురంలో రంగమ్మ, రంగరాజులది వ్యవసాయ కుటుంబం. ఆయన కొడుకు రమేష్ వ్యవసాయం చేస్తూ బాగా సంపాదించేవాడు. అతని కుమార్తె శ్రీజ, కుమారుడు శ్రీకర్. కుమార్తె ఎనిమిదో తరగతి, కుమారుడు ఆరో తరగతి ఆ గ్రామ పాఠశాలలోనే చదువుతున్నారు.**

కథ

# మాతృభాష మాధుర్యం

నాగరాజు కామర్సు

రంగరాజు స్నేహితుడు రామారావు లక్ష్మి దంపతులు ఊర్లో, వీళ్ళింటి పక్కనే ఉండేవారు. వాళ్ళ అబ్బాయి సీతారాం గత పదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. వాళ్ల పిల్లలు హేమ, గణేశ్... రమేష్ పిల్లలు శ్రీజ, శ్రీకర్‌లది ఒకే వయస్సు కానీ, సీతారాం పిల్లలు చదివేది ఇంగ్లీష్ మీడియం అవడం వల్ల వాళ్లకి తెలుగు మాట్లాడడం రాదు. ఇంట్లో తల్లిదండ్రులు తెలుగులో మాట్లాడుతుంటే తాము అర్థం చేసుకోలేకపోతున్నందుకు ఎంతో బాధపడేవారు. ఎలాగైనా తెలుగు నేర్చుకోవాలని, తల్లిదండ్రుల్లాగా తామూ మాట్లాడగలగాలనే పట్టుదల సీతారాం పిల్లలలో బలంగా నాటుకుపోయింది. సీతారాం అడపా దడపా ఏడాదికో రెండేళ్లకోసారి వచ్చి రెండు నెలలు ఉండి వెళ్లడం తప్ప మన సంస్కృతి, భాష పిల్లలకు నేర్పాలనే విషయంలో పెద్దగా దృష్టి పెట్టలేదు. రమేష్ తన కుటుంబంతో సీతారామపురంలోనే ఉంటూ, వ్యవసాయంలో మెళకువల్ని పాటించి, పంటలు పండిస్తూ బాగా స్థిరపడ్డాడు. వాళ్ళ పిల్లలు స్థానిక పాఠశాలలో తెలుగు మీడియంలో చదవడం వల్ల పద్యాలు, పాటలు, గేయాలు చక్కగా చదివేవారు. కథలను బాగా చెప్పేవారు. పాఠశాలలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా అందులో ఉత్సాహంగా పాల్గొంటూ నాటకాలు ఏకపాత్రాభినయాలు వేయడం, పద్యాలు, పాటలు చదువుతూ తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, ఇతర పిల్లలకు పోటీగా నిలుస్తూ, బహుమానాలు అందుకునేవారు. 'మాతృభాష' తెలుగంటే వాళ్లకు ఎనలేని మమకారం.



పిల్లలకు సెలవులు రావడంతో ఎప్పటిలాగే ఓ మూణ్ణెల్లు ఉండి పోదామనుకొని, అమెరికా నుండి ప్రయాణమైన సీతారామ్ కుటుంబ సభ్యులు, పిల్లలతో సహా స్వదేశానికి బయలుదేరి సీతారామపురం వస్తున్నారు. వారి పిల్లలు హేమ, గణేశ్‌లు సొంతూరికి వెళ్తున్నందుకు ఎంతో మురిసిపోయారు.

రెండు రోజుల తదుపరి సీతారాం కుటుంబం ఊర్లోకి ప్రవేశిస్తూనే గ్రామస్తులు కొందరు ఆప్యాయంగా పలకరించి, క్షేమ సమాచారాలు అడుగుతూ, వారి లగేజీ బ్యాగులను అందుకుని వారి వెంట ఊర్లోకి నడుస్తున్నారు.

ఈ విషయాన్ని గమనిస్తున్న సీతారాం పిల్లలు హేమ, గణేశ్‌లు గ్రామంలో ప్రజల ఆదరణ ఆప్యాయతకు ఆశ్చర్యపడ్డారు.

రమేష్, సీతారాం కుటుంబాల వారు చిన్ననాటి స్నేహితులు. పక్కపక్క ఇళ్ళు కనుక... ఒకరింటికొకరు

వస్తూ వెళ్తూ వుంటారు. హేమ, గణేశ్‌లు రోజూ రమేశ్ ఇంటికి వెళ్లి శ్రీజ, శ్రీకర్‌లతో ఆడుతూ, పాడుతూ కాలక్షేపం చేసేవారు. కానీ వీరికి తెలుగు రాదు అర్థం కాదు. రమేష్ పిల్లలకు ఇంగ్లీషు రాదు. వచ్చీరాని భాషలో ఆ పిల్లలు, ఈ పిల్లలు ఒకరినొకరు కొంచెం అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూ, కాలం గడిపేవారు.

హేమ, గణేశ్‌లు తెలుగు మాట్లాడలేకపోతున్నందుకు సిగ్గుపడేవారు. కనీసం అమెరికాలో తమ తల్లిదండ్రులు ఇంట్లో తమతో తెలుగులో మాట్లాడి ఉంటే కొంత అర్థమయ్యేదేమో? అని అనుకునేవారు. ఊర్లో శ్రీజ, శ్రీకర్‌తో సహా అందరూ మాట్లాడుతూ, పలకరిస్తుంటే వీళ్లకి ఏమీ అర్థం కాక బిక్క మొహం వేసేవారు. చూస్తుండగా వారం రోజులు గడిచిపోయాయి.

ప్రతిరోజు శ్రీజ, శ్రీకర్‌లు బడి నుంచి రాగానే, హేమ, గణేశ్‌లు వారి దగ్గరకి వెళ్ళేవారు. పిల్లల హోంవర్క్ అయిన తర్వాత వాళ్ళ నానమ్మ పిల్లలు నలుగురినీ దగ్గర కూర్చోబెట్టుకుని నీతి కథలు చెప్పేది. మరోరోజు తాతయ్య పాటలు, పద్యాలు నేర్పించేవాడు.

శ్రీజ, శ్రీకర్‌లు కేరింతలు కొడుతూ ఆస్వాదించేవారు. వాళ్ల నానమ్మ తాతలు ఎంతో ఆప్యాయంగా పిల్లలను కూర్చోబెట్టుకుని ఇలా చేయడంతో పిల్లలు చక్కగా కాలక్షేపం చేసేవారు. కానీ తెలుగు భాషే రాని హేమ, గణేశ్‌లకు ఒక్క ముక్కైనా అర్థమయ్యేది కాదు. దాంతో వారి లోపల తామేదో కోల్పోతున్నామన్న ఆవేదన ఉండేది. విషయాన్ని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో చెప్పి బాధ పడేవారు. వీళ్ళు తల్లిదండ్రులతో చెప్పే విషయం వాళ్ళ నానమ్మ తాతయ్యలకు అర్థంకాక వారి మొహాలు చూస్తూ నిలబడేవారు. తాము తెలుగు నేర్చుకోకుండా మాట్లాడకుండా ఉండడంవల్ల జరిగిన నష్టాన్ని హేమ, గణేశ్‌లు తెలుసుకున్నారు. తామెలాగైనా తెలుగు చక్కగా మాట్లాడగలగాలని, తెలుగు పాటలు, పద్యాలు చదవాలని, నాటికలు వేయాలని, కథలను చక్కగా అర్థం చేసుకొని, చెప్పగలగేలా చూడాలని తండ్రిని ప్రాధేయపడసాగారు.

తెలుగు నేర్చుకోవాలని పిల్లల్లో వచ్చిన అనూహ్య మార్పుకు సీతారాం దంపతులు సంతోషపడ్డారు. మాతృభాష పట్ల తన పిల్లలకు కలిగిన మమకారాన్ని, ఆసక్తిని గమనించిన సీతారాం వెంటనే శ్రీజ, శ్రీకర్‌లు వెళ్లే పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణరావు మాస్టారుని కలిసి, పరిస్థితిని వివరించాడు. తాము పిల్లలతో ఇక్కడ ఉండే మూడు నెలల్లో, తమ పిల్లలకు కచ్చితంగా తెలుగు వచ్చేలా కృషి చేయాలని ప్రాధేయపడ్డాడు.

మాతృభాషపై మమకారంతో సీతారాం అడిగిన మాటకు మాస్టారు సంతోషించి పిల్లలకు తప్పకుండా తెలుగు భాష నేర్పుతానని ఆయన సీతారాంకు హామీ ఇచ్చి, మరుసటిరోజు నుండే పిల్లలను ప్రతిరోజూ తన దగ్గరికి పంపమని, వాళ్ల తెలుగు మాట్లాడగలిగేలా, పద్యాలు, గేయాలు, పాటలు పాడేలా కృషి చేయగలనని చెప్పారు. తెలుగు మాస్టారు హామీతో సీతారాం దంపతులు, హేమ, గణేశ్‌ల ఆనందానికి అవధులు లేవు.

మరుసటి రోజు నుండి పిల్లలిద్దరూ పలకలు బలపాలు, నోట్ బుక్స్, పెన్నులు తీసుకుని లక్షణరావు మాస్టారు దగ్గరికి వెళ్లి చదువుకోవడం ప్రారంభించారు. అక్షరమాల, గుణింతాలతో వారి చదువు ప్రారంభమైంది.

అక్షరాలు దిద్దడం అలవాటులేక వారు చాలా కష్టపడాల్సి వచ్చింది. అయినప్పటికీ మాస్టారు వారిని వెన్ను తట్టి ధైర్యం చెప్పి అక్షరాలను నేర్పడం ప్రారంభించాడు. ఇలా వారం రోజులు గడిచేసరికి వాళ్ళు

**లక్షణరావు మాస్టారు పిల్లలను బాగా ప్రోత్సహిస్తూ, పెద్ద బాలశిక్ష చదివించడం అందులోని పదాలను, వాక్యాలను చెప్పడం, అనిపించడం, రాయించడం చేసేవారు. ఇలా మరొక పదిహేను ఇరవై రోజుల్లో వాళ్ళు పెద్దబాల శిక్ష కూడా నేర్చుకున్నారు.**

అక్షరమాల నేర్చుకొని, గుణింతాలను గుర్తించి చెప్పగలిగే స్థితికి ఎదిగారు. అమెరికాలో ఉండగా ఇంట్లో తెలుగు మాట్లాడితే, తామూ మాట్లాడాలని తపన పడిన హేమ, గణేశ్‌లు మాతృభాష మాధుర్యం ఎంత గొప్పదో? తమ సొంతూరు వచ్చాక మాత్రమే గుర్తించగలిగామని వచ్చీ రాని భాషలో మాస్టారుతో చెప్పారు.

శ్రీజ, శ్రీకర్‌లకు వాళ్ళ నానమ్మ చెప్పే కథలు, తాత చెప్పే పద్యాలు, గేయాలు, పాటలు వీళ్ళపై చెరగని ముద్ర వేశాయి. చూస్తుండగా నెల రోజులు అయ్యేసరికి వర్ణమాల, గుణింతాలు, పదాలు నేర్చుకున్నారు హేమ, గణేశ్‌లు.

ఇక లక్ష్మణరావు మాస్టారు పిల్లలను బాగా ప్రోత్సహిస్తూ, పెద్ద బాలశిక్ష చదివించడం అందులోని పదాలను, వాక్యాలను చెప్పడం, అనిపించడం, రాయించడం చేసేవారు. ఇలా మరొక పదిహేను ఇరవై రోజుల్లో వాళ్ళు పెద్ద బాలశిక్ష కూడా నేర్చుకున్నారు. మెల్లమెల్లగా వాళ్ళకిపుడు తెలుగు అర్థం చేసుకోవడం బాగా వచ్చింది. పదాలను, చిన్న చిన్న వాక్యాలను మాట్లాడటం నేర్చుకున్నారు.

ఈ విషయాన్ని గమనించిన సీతారాం దంపతులు చాలా ఆనందించారు. తాత నానమ్మలు మనవడు, మనవరాలు చేస్తున్న కృషికి ఎంతో సంతోషించారు. రెండు నెలలు పూర్తి అయ్యేసరికి హేమ, గణేశ్‌లు తెలుగులో మెల్లమెల్లగా మాట్లాడగలిగారు. పద్యాలు గేయాలు

పాఠాలు కూడా తప్పుల్లేకుండా చక్కగా చదవగలుగుతున్నారు.

శ్రీజ, శ్రీకర్‌తో ఇరువురు కూడా చక్కగా మాట్లాడుతూ ఆడుతూ, పాడుతూ ఆహ్లాదంగా గడపసాగారు.

ఇంతలో.. "తెలుగు భాష దినోత్సవం" వచ్చింది. ప్రధానోపాధ్యాయుని అనుమతితో పాఠశాలలో తెలుగు మాస్టారు పిల్లలకు పద్యాలు, గేయాలు, పాటల పోటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాస్టారు శ్రీజ, శ్రీకర్‌లతో పాటు, ప్రధానోపాధ్యాయున్ని సంప్రదించి సీతారాం పిల్లలు హేమ, గణేశ్‌లను కూడా బడికి పిలిపించాడు.

ఈ విషయం తెలిసిన సీతారాం సంతోషించి పోటీలో నెగ్గిన పిల్లలకు తాను బహుమతులు అందజేస్తానని కృతజ్ఞతా పూర్వకంగా లక్ష్మణరావు మాస్టారుకు తెలిపారు. ప్రథమ బహుమతికి ఐదు వేలు, ద్వితీయ బహుమతికి నాలుగు వేలు, ప్రోత్సాహక బహుమతి కింద వెయ్యి రూపాయల చొప్పున ముగ్గురికి బహుమతుల కొరకు పన్నెండు వేల రూపాయలను వెంటనే లక్ష్మణరావు మాస్టారు ద్వారా ఆయన ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు.

శ్రీజ, శ్రీకర్ పాఠశాలలోని ఇతర విద్యార్థులతో పాటు సీతారాం పిల్లలు హేమ, గణేశ్‌లు కూడా ఈ పోటీలలో పాల్గొన్నారు. శ్రీజ, శ్రీకర్‌లు పద్యాలు, గేయాలలో ప్రథమ, ద్వితీయ బహుమతులను, మరో ముగ్గురు బడి పిల్లలు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు.

ప్రధానోపాధ్యాయుడు, సీతారాం చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ఇప్పించి అభినందించారు. అనతి కాలంలోనే పట్టుదలతో తెలుగు నేర్చుకుని, పద్యాలు, గేయాలు, పాటలు చక్కగా పాడుతూ తెలుగు మాట్లాడుతూ తెలుగు భాష గౌరవాన్ని ఇనుమడింపజేసిన సీతారాం పిల్లలు హేమ, గణేశ్‌లను మెచ్చుకున్న ప్రధానోపాధ్యాయుడు, స్వయంగా తాను వారికి బహుమతులు ప్రకటించాడు. పిల్లలకు నగదు బహుమతిని అందించిన సీతారాంను శాలువాతో సత్కరించి ఆయన పిల్లలకు మెమెంటోలు కథల పుస్తకాలను అందజేసి అభినందించారు.




అమెరికాలో ఉన్నపుడు తెలుగు అంటే తెలియని పిల్లలు, ఇక్కడికి రాగానే స్వంత ఊరు, తోటి పిల్లలు, మాతృభాషతో ప్రభావితమై తెలుగు మాట్లాడడంతో పాటు, పద్యాలు, గేయాలు, పాటలు నేర్చుకోవడం ముదావహమని ప్రధానోపాధ్యాయుడు అన్నారు. ఈ కాలంలో కొందరు తెలుగు వాళ్ళైయుండి, తెలుగులో మాట్లాడకుండా, పర భాష వ్యామోహంలో పడి తెలుగును విస్మరిస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం తగదని తెలిపారు. సీతారాం పిల్లలు చూపిన చొరవ, మాతృభాష పట్ల వారికి గల గౌరవం మమకారం అలాంటి వారికి చెంపపెట్టు లాంటిదని సభాముఖంగా చెప్పారు. 'తెలుగు భాషా దినోత్సవం' సందర్భంగా ఈ పిల్లలు మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సీతారాం పిల్లలు హేమ, గణేశ్‌లను వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణరావు మాస్టారుని అభినందించారు.

ఇక నుండి ప్రతి సంవత్సరం సెలవుల్లో సీతారామపురం వస్తామని, అమెరికాలోనూ తోటి తెలుగు పిల్లలకు తెలుగును నేర్పించి, మాతృభాష గొప్పదనాన్ని తెలియజేస్తామని హేమ, గణేశ్‌లు బహుమతి తీసుకున్న సందర్భంగా సభా ముఖంగా హామీ ఇచ్చారు. తమకు తెలుగు భాషను నేర్పించిన లక్ష్మణరావు మాస్టారుకు వారు కృతజ్ఞతాభివందనం చేసారు.

పిల్లల కరతాళ ధ్వనుల మధ్య నాటి సమావేశం ముగిసింది. తమ మనవరాలు, మనవడు తెలుగు నేర్చుకుని మాట్లాడడంతో తాతా నానమ్మ రామారావు లక్ష్మి దంపతులు ఎంతో సంతోషించారు.

## ఎమ్మారై స్కాన్ సులభంగా..

శరీరం లోపలి అవయవాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడానికి వైద్యులు ఎమ్ఆర్ఐ స్కాన్‌ను సూచిస్తుంటారు. అత్యంత శక్తివంతమైన అయస్కాంత, రేడియో తరంగాల్ని ఉపయోగించి చేసే ఈ స్కాన్ ఖరీదైనది. అయితే ఇది అన్ని గ్రామీణ ప్రాంతాల్లో అందుబాట్లో లేదు.



ఈ సమస్యను పరిష్కరించడానికి అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ పరిశోధకులు బెండముల్ వైర్‌లెస్ కాయిల్ సెన్సార్‌ని తయారు చేసారు. తక్కువ బరువుతో ఉండే ఈ కాయిల్‌ను దెబ్బ తగిలిన చోట చుడితే అనుసంధానించబడిన ఎమ్మారై కంప్యూటర్‌లో లోపల ఎంత వరకు గాయంతో అయిందో స్కాన్ చేసి చూపిస్తుందీ పరికరం.

గతంలో శస్త్రచికిత్సల కారణంగా శరీరం లోపల లోహపు వస్తువులు అమర్చితే సాధారణ ఎమ్మారై స్కాన్ చేయటం కష్టం. ఈ ఎమ్మారై కాయిల్‌తో ఎలాంటి ఇబ్బంది లేకుండా దెబ్బ తగిలిన చోట స్కాన్ చేసే వీలుంటుంది.

# మహానీయుల మాసం 'ఏప్రిల్'

భారతదేశ చరిత్రలో ఏప్రిల్ నెలకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఈ నెలను 'మహానీయుల మాసం'గా పిలుస్తారు. ఎందుకంటే ఈ నెలలో సమాజాన్ని మార్చిన గొప్ప మహానుభావులు జన్మించారు. వారి ఆలోచనలు, సేవలు, త్యాగాలు మన జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ముఖ్యంగా ఈ నెలలో మనం గుర్తు చేసుకోవాల్సిన మహానీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే.

**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్** ఏప్రిల్ 14న జన్మించారు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా ప్రసిద్ధి చెందారు. చిన్నప్పటి నుంచే ఆయన అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. అణగారిన వర్గాలకు చెందినవారిగా సమాజంలో వివక్షను అనుభవించారు.

అయినప్పటికీ, విద్యను ఆయుధంగా తీసుకుని ముందుకు సాగారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి, భారతదేశానికి తిరిగి వచ్చి సమానత్వం కోసం పోరాడారు. ఆయన రచించిన రాజ్యాంగం ప్రతి భారత పౌరుడికి సమాన హక్కులను కల్పించింది.







**బాబు జగ్జీవన్ రామ్** కూడా ఏప్రిల్ నెలలోనే (ఏప్రిల్ 5) జన్మించారు. ఆయన భారతదేశానికి సేవ చేసిన గొప్ప నాయకుడు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన కష్టపడి ఎదిగి దేశంలో ప్రముఖ నాయకుడయ్యారు. ఆయన అనేక పదవుల్లో పని చేసి దేశాభివృద్ధికి తోడ్పడ్డారు. ముఖ్యంగా అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అమూల్యమైనది. సమాజంలో సమానత్వం స్థాపించడానికి ఆయన ఎంతో కృషి చేశారు.

**జ్యోతిరావు పూలే** కూడా ఒక గొప్ప సంస్కర్త. ఆయన జన్మదినం ఏప్రిల్ 11న జరుపుకుంటారు. పూలే గారు విద్య ప్రాముఖ్యతను గుర్తించి, సమాజంలో అజ్ఞానాన్ని తొలగించడానికి కృషి చేశారు. ముఖ్యంగా బాలికల విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. తన భార్యతో కలిసి మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. కులవ్యవస్థ, అజ్ఞానం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎంతో గొప్పది.

ఈ ముగ్గురు మహానీయుల జీవితాలను పరిశీలిస్తే ఒక ముఖ్యమైన విషయం స్పష్టమవుతుంది. వారు సమాజంలో మార్పు తీసుకురావడానికి తమ జీవితాన్ని అంకితం చేశారు.

ఏప్రిల్ నెలను 'మహానీయుల మాసం'గా పిలవడానికి ప్రధాన కారణం– ఈ మహానుభావుల జననం మాత్రమే కాదు, వారి ఆలోచనలు. ఈ నెలలో మనం వారి జీవితాలను చదవాలి, వారి సందేశాలను అర్థం చేసుకోవాలి. అంబేద్కర్ సమానత్వం, జగ్జీవన్ రామ్ సేవాభావం, పూలే విద్యా ప్రాధాన్యం.. ఇవన్నీ మన జీవితాల్లో అమలు చేయాల్సిన విలువలు.

విద్యార్థులకు ఈ నెల ప్రత్యేకమైన ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ మహానీయుల జీవిత చరిత్రలను చదివితే, వారు స్ఫూర్తి పొందగలరు. కష్టపడి చదవడం, సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగడం, ఇతరులకు సహాయం చేయడం వంటి మంచి లక్షణాలు అభివృద్ధి చెందుతాయి. ఈ మహానీయులు చూపిన మార్గం యువతకు ఎంతో అవసరం.

మన సమాజంలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. అసమానత్వం, అజ్ఞానం, పేదరికం. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఈ మహానీయుల ఆలోచనలు ఎంతో ఉపయోగపడతాయి. సమానత్వం, న్యాయం, విద్య.. ఇవి సమాజ అభివృద్ధికి ముఖ్యమైన అంశాలు. ఈ విలువలను మనం పాటిస్తే, మన దేశం అభివృద్ధి చెందుతుంది.

మహానీయుల మాసం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం పెంచుతారు. కుటుంబ స్థాయిలో కూడా ఈ నెలను ప్రాముఖ్యతతో గుర్తించాలి. పెద్దలు పిల్లలకు మహానీయుల కథలు చెప్పాలి. వారి జీవితాల్లోని విలువలను వివరించాలి.

మొత్తంగా చూస్తే, ఏప్రిల్ నెల మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది 'మహానీయుల మార్గంలో నడవాలి'. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వ భావన, బాబు జగ్జీవన్ రామ్ సేవా భావం, జ్యోతిరావు పూలే గారి విద్యా ప్రాధాన్యం.. ఇవన్నీ మన జీవితానికి మార్గదర్శకాలు. మనం కూడా ఈ విలువలను అనుసరిస్తే, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగగలం. అప్పుడు మాత్రమే 'మహానీయుల మాసం' అనే పేరు సార్థకమవుతుంది. మనం వారి వారసులుగా నిలుస్తాం.

– ఎల్. ఉపేందర్

# సమయం మార్పు-అవసరమా?

ప్రతి సంవత్సరం మార్చి చివరి ఆదివారం వచ్చినప్పుడు, యూరప్ సహా అనేక దేశాలు Daylight Saving Time (DST) అమలు చేస్తాయి. ఈ విధానం ప్రకారం గడియారాలను ఒక గంట ముందుకు మార్చడం ద్వారా సాయంత్రపు వెలుతురు ఎక్కువగా వినియోగించుకోవడం లక్ష్యం. అయితే, ఈ సమయం మార్పు నిజంగా ప్రయోజనకరమా లేదా అనేది గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా చర్చకు వస్తున్న కీలక అంశంగా మారింది.

## ఆవిర్భావం

DST ఆలోచన మొదటగా 18వ శతాబ్దంలోనే ప్రతిపాదించబడినా, అది విస్తృతంగా అమలు కావడం మొదలైంది World War I సమయంలో. యుద్ధ కాలంలో ఇంధనాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో యూరప్ దేశాలు ఈ విధానాన్ని ప్రవేశపెట్టాయి. తరువాత ....World War II సమయంలో కూడా దీన్ని కొనసాగించారు. అప్పట్లో ఇది అవసరమైన చర్యగా కనిపించినా, ప్రస్తుతం అదే విధానం ఎంతవరకు అవసరం? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## ప్రయోజనాలు-నిజంగా లాభాలున్నాయా?

DST అమలుకు ప్రధాన కారణం విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం. సాయంత్రం సమయాల్లో సహజ వెలుతురు ఎక్కువగా ఉండటంతో లైట్లు, ఇతర విద్యుత్ పరికరాల వినియోగం తగ్గుతుందని భావించారు. కొంతమంది నిపుణులు ఇది కొంతవరకు సఫలమైందని చెబుతారు.

ఇక సామాజిక దృష్టితో చూస్తే, ఎక్కువ వెలుతురు ఉండటం వల్ల ప్రజలు బయటకు వెళ్లి శారీరక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం పెరుగుతుంది. వ్యాపార రంగానికి కూడా ఇది కొంత మేరకు మేలు చేస్తుంది, ఎందుకంటే సాయంత్రం షాపింగ్, వినోద కార్యకలాపాలు పెరుగుతాయి.

## సమస్యలు-ఆరోగ్యం నుంచి ఆర్థికం వరకు

అయితే DSTపై విమర్శలు కూడా అంతే బలంగా ఉన్నాయి. గడియారాన్ని ఒక గంట ముందుకు



మార్చడం వల్ల మానవ శరీరంలోని సర్కేడియన్ రిథమ్ (జీవ గడియారం)లో అంతరాయం కలుగుతుంది. దీని వల్ల నిద్ర సమస్యలు, అలసట, దృష్టి లోపం వంటి సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశముందని కూడా కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా సమయం మారిన వెంటనే వచ్చే రోజుల్లో ప్రమాదాల రేటు పెరుగుతుందని గమనించారు.

ఆర్థిక పరంగా చూస్తే, విద్యుత్ ఆదా అవుతుందనే భావనకు పూర్తి స్థాయిలో ఆధారాలు లేవు. ఆధునిక కాలంలో ఎయిర్ కండిషనర్లు, డిజిటల్ పరికరాలు ఎక్కువగా వాడటం వల్ల DST వల్ల కలిగే లాభం తగ్గిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ప్రపంచ దృక్పథం-మారుతున్న నిర్ణయాలు.

ప్రస్తుతం అన్ని దేశాలు DST పాటించడం లేదు. ఉదాహరణకు India, Japan వంటి దేశాలు దీన్ని అనుసరించవు. యూరప్‌లో కూడా DSTను పూర్తిగా రద్దు చేయాలనే చర్చలు కొనసాగుతున్నాయి. యూరోపియన్ యూనియన్‌లోని కొన్ని దేశాలు ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఈ విధానాన్ని నిలిపివేయాలని భావిస్తున్నాయి.

## భవిష్యత్తులో కొనసాగాలా, ముగియాలా?

DST ఒకప్పుడు అవసరమైన విధానం కావచ్చు. కానీ ప్రస్తుత డిజిటల్ యుగంలో, జీవనశైలులు మారిన నేపథ్యంలో దీని ప్రాముఖ్యత తగ్గుతోంది. ప్రజల ఆరోగ్యం, జీవన నాణ్యతను దృష్టిలో ఉంచుకుంటే, DST కొనసాగించాలా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.

## ముగింపు

Daylight Saving Time ఒక సరళమైన గడియార మార్పు కాదని, అది సమాజంపై విస్తృత ప్రభావం చూపే విధానం అని చెప్పాలి. గతంలో ఇది ప్రయోజనకరంగా కనిపించినా, ప్రస్తుతం అది ఎంతవరకు అవసరమో పునర్విమర్శించాల్సిన సమయం వచ్చింది. సమయం మార్పు కంటే, కాలానికి అనుగుణంగా విధానాలు మారడం ముఖ్యం.

– ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

# ప్రశ్నల వెనుక దాగిన విజయం

మన విద్యా వ్యవస్థలో తరచూ వినిపించే ఒక ముఖ్యమైన వాక్యం "చదువు అంటే జ్ఞానం సంపాదించడం". కానీ ఆ జ్ఞానం ఎలా సంపాదించాలి? కేవలం పాఠ్యపుస్తకాలను కంఠస్థం చేసుకోవడం ద్వారానా? లేక మరింత లోతుగా ఆలోచించి, ప్రశ్నించి తెలుసుకోవడమా? ఈ ప్రశ్నలకు సమాధానం స్పష్టంగా ఒకటే. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్న విద్యార్థులే నిజమైన అర్థంలో విద్యలో రాణిస్తారు.

ప్రశ్నించడం అనేది ఒక సాధారణ చర్య కాదు; అది ఆలోచనకు మూలం. ఒక విద్యార్థి 'ఎందుకు?' 'ఎలా?' 'ఇది నిజమేనా?' అని అడగడం ప్రారంభించినప్పుడు, అతని మేధస్సు చురుకుగా మారుతుంది. ఇలాంటి ప్రశ్నలు అతనిని కేవలం పాఠ్యాంశాల పరిమితుల్లో కాకుండా, విస్తృతమైన అవగాహన వైపు నడిపిస్తాయి. ప్రశ్నించడం వల్ల ఒక విషయం వెనుక ఉన్న కారణాలను, దాని ఉపయోగాలను, దాని పరిమితులను కూడా తెలుసుకోవచ్చు.




దురదృష్టవశాత్తూ, మన విద్యా విధానంలో ఇంకా చాలా చోట్ల ప్రశ్నించడాన్ని ప్రోత్సహించరు. చాలా మంది ఉపాధ్యాయులు పాఠాన్ని చెప్పడం వరకే తమ బాధ్యతను పరిమితం చేసుకుంటారు. విద్యార్థి సందేహాలు అడిగితే " తరువాత చూద్దాం" లేదా "ఇది పరీక్షలో రాదు" అని నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. దీనివల్ల విద్యార్థుల్లో ప్రశ్నించే ఆసక్తి తగ్గిపోతుంది. క్రమంగా వారు కేవలం మార్కుల కోసం చదివే యంత్రాలుగా మారిపోతారు.

అయితే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గొప్ప శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు అందరూ ప్రశ్నించే తత్వం వల్లనే ఎదిగారు. ఒక చిన్న సందేహం పెద్ద ఆవిష్కరణకు దారి తీసిన ఉదాహరణలు అనేకం ఉన్నాయి. గురుత్వాకర్షణ సిద్ధాంతం నుంచి విద్యుత్ ఆవిష్కరణ వరకు.. ఇవన్నీ ఒక ప్రశ్నతోనే మొదలయ్యాయి. అందువల్ల విద్యార్థుల్లో ఈ తత్వాన్ని చిన్నప్పటి నుంచే పెంపొందించడం అత్యంత అవసరం. ప్రశ్నించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. వారు కొత్త కోణాల్లో ఆలోచించడం ప్రారంభిస్తారు. ఒక సమస్యకు అనేక పరిష్కారాలు వెతకడం నేర్చుకుంటారు. ఇది కేవలం విద్యలోనే కాదు, జీవితంలో కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఉద్యోగ జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడానికి ఈ నైపుణ్యం ఎంతో అవసరం. ఇక్కడ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలు ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు దానిని నిర్లక్ష్యం చేయకుండా, ఓర్పుతో సమాధానం చెప్పాలి. "ఇలా ఎందుకు ఆలోచిస్తున్నావు?" అని ప్రోత్సహించాలి. పిల్లలు తప్పుగా ప్రశ్న అడిగినా, దాన్ని తప్పుపట్టకుండా, సరైన దారిలో నడిపించాలి. ఇలాంటి వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే విద్యార్థులు ధైర్యంగా తమ సందేహాలను వ్యక్తపరుస్తారు.

పాఠశాలల్లో కూడా బోధనా విధానంలో మార్పులు అవసరం. కేవలం లెక్చర్ విధానం కాకుండా, చర్చలు, గ్రూప్ యాక్టివిటీలు, ప్రాజెక్ట్ పనులు వంటి పద్ధతులు ఉపయోగిస్తే విద్యార్థులు ఎక్కువగా పాల్గొంటారు. ఇలా చేసినప్పుడు వారు సహజంగానే ప్రశ్నించడం ప్రారంభిస్తారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రశ్నలను ఆహ్వానించాలి. "ప్రశ్నించండి" అనే సంస్కృతి పాఠశాలల్లో నెలకొల్పాలి.

అదేవిధంగా, పరీక్షల విధానంలో కూడా మార్పులు అవసరం. కేవలం కంఠస్థం చేసిన విషయాలను పరీక్షించడం కాకుండా, విశ్లేషణాత్మక ప్రశ్నలు, అభిప్రాయాలను పరీక్షించే విధానం ఉండాలి. ఇది విద్యార్థులను లోతుగా ఆలోచించేలా చేస్తుంది. అప్పుడు వారు సహజంగానే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటారు. సాంకేతికత కూడా ఇందులో కీలక పాత్ర పోషించగలదు. ఇంటర్నెట్, డిజిటల్ లైబ్రరీలు, ఆన్‌లైన్ కోర్సులు వంటి వనరులు విద్యార్థులకు విస్తృతమైన సమాచారాన్ని అందిస్తున్నాయి. ఒక చిన్న సందేహం వచ్చినా వెంటనే దాని గురించి తెలుసుకునే అవకాశం ఉంది. అయితే, ఈ వనరులను సక్రమంగా ఉపయోగించడం కూడా నేర్పించాలి. మొత్తం మీద, ప్రశ్నించడం అనేది విద్యార్థి అభివృద్ధికి కీలకమైన సాధనం. ఇది జ్ఞానాన్ని పెంచడమే కాకుండా, ఆలోచనా విధానాన్ని మారుస్తుంది. ప్రశ్నించే తత్వం ఉన్న విద్యార్థి ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉంటాడు. అతను కేవలం పుస్తకాలలోని జ్ఞానంతో కాకుండా, అనుభవంతో కూడిన జ్ఞానాన్ని సంపాదిస్తాడు. అందువల్ల, విద్యార్థులు ప్రశ్నించడం భయపడకూడదు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలి. "ప్రశ్నించు నేర్చుకో ఎదుగు" అనే భావనను ప్రతి విద్యార్థి తన జీవితంలో ఆచరించాలి. అప్పుడు మాత్రమే నిజమైన విద్యార్థి విజయాన్ని సాధించగలడు.

– తిప్పర్తి శ్రీనివాస్

# 'శల్య వేధ' అంటే ?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458



**సి.వాసుదేవ్, కొడంగల్**

**ప్రశ్న: 'శల్యవేధ' గురించి వివరించగలరు.**

**జవాబు:** గృహం నిర్మించిన ప్రదేశంలోగానీ, ఆవరణలోగానీ భూమి లోపల శల్యములున్నట్లయితే 'శల్యవేధ' దోషం కలుగుతుంది. శల్యం అంటే క్షీణిస్తోంది అని అర్థం. ఎముకలు, దంతాలు, వెంట్రుకలు, గోర్లు, చర్మం, క్షీణిస్తున్న లోహములు, బొగ్గులు మొదలైనవి. భూమిలో శల్యములున్నట్లయితే గృహ యజమానికి, అందులో నివసించే వారికి క్రమంగా, వరుసగా కష్టనష్టాలు అనుభవంలోకి వస్తూ మృత్యువును కూడా పొందవలసి రావచ్చు.



గృహం వాస్తు ప్రకారం శ్రేష్టమైనదిగా కనిపించినప్పటికీ పైన పేర్కొన్న చెడు ఫలితాలను ఆ గృహంలో నివసించేవారు అనుభవిస్తున్నట్లయితే శల్యాలను తీసివేయటం వలన తిరిగి మంచి ఫలితాలను చాలా సులభంగా పొందవచ్చు. 'శల్యవేధ' ప్రమాణం ఒక మనిషి సాధారణ ఎత్తుగా చెప్పబడింది. అంటే భూమిపై భాగం నుండి మనిషి ఎత్తు (8 అడుగులు x12 అంగుళాలు=96) వరకు శల్యములు ఉండకూడదు. అంతకంటే క్రిందికి శల్యాములు ఉంటే అది దోషం కాదు. గృహ నిర్మాణమునకు క్షేత్రాన్ని ఎన్నుకొన్నప్పుడే శల్యములు లేవని నిర్ధారించుకోవటం మంచిది.

బయట నుండి మట్టిని తెచ్చి గృహ నిర్మాణ క్షేత్రంలో నింపవలసి వస్తే ఆ మట్టిలో శల్యములు లేకుండా ముందే జాగ్రత్త పడటం మంచిది. అలా కానప్పుడు ఆ క్షేత్రంలోగానీ, ఆ మట్టిలోగానీ శల్యములు ఉండిపోతే గృహ నిర్మాణం ఆరంభించిన తరువాత గానీ గృహ నిర్మాణాంతరం గానీ ఈ దోషాలను సరిచేయటం కష్టసాధ్యం కావొచ్చు. కొన్ని చోట్ల వారి వారి ఆచారాలను అనుసరించి కొన్ని పూజలు చేయవలసి ఉంటుంది. మాంసాహారం ఆరగించిన తరువాత మిగిలిన ఎముకలను, జంతు చర్మాన్ని ఇంటి ఆవరణలో గొయ్యి తీసి అందులో వేసి తిరిగి పూడ్చివేయటం ఆచారంగా పాటిస్తారు. ఇటువంటి ఆచారాలను పాటించటం తప్పనిసరి అయినప్పుడు ఎముకలను మొదలైన వాటిని పూడ్చటానికి తీసే గొయ్యిని 9 అడుగుల మేరకు లోతుగా తీసి అందులో శల్యములను వేసి పూడ్చేయటం వలన దోషముండదు.

## వాస్తుదోషాలున్నాయా?

**ఎస్.కార్తిక్, నెల్లూరు**

**ప్రశ్న: మాది దక్షిణ ముఖం గల ఇల్లు. ఇంట్లో ఈశాన్య మూలన ప్రత్యేక పూజాగది నిర్మించుకొన్నాం. "ఈశాన్యాన్ని మూసేసి గది కట్టకూడదు, అక్కడ బరువులు కూడా ఉండకూడదు" అని చెబుతున్నారు కొందరు. ఇది వాస్తుదోషమా? వస్తే దీనికి పరిష్కారం మార్గం తెలుపగలరు.**

**జవాబు:** గృహానికి పూర్తి ఈశాన్య మూలలో పూజగది నిర్మాణం వలన ఈశాన్య మూత ఏర్పడుతుంది. అక్కడ నడక (ద్వారం) ప్రధానం. తూర్పున పూజాగది నిర్మాణం గావించుకోవటం మంచిది.

## ఋణబాధలు తగ్గేదెలా?

**ఎన్.శ్రీనివాస్, విజయనగరం**

**ప్రశ్న: పదిహేను సంవత్సరాల క్రితం మేం నూతన గృహం కట్టుకున్నాం. ఆ తరువాత రెండు సంవత్సరాల వరకు అంతా బాగానే ఉన్నది. తరువాత మాకు ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. మా వారు చేసే వ్యాపారంలో నష్టం వచ్చింది. అప్పటి నుండి మా వారు ఎన్ని ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఏ ఉద్యోగంలోనూ స్థిరత్వం లేదు. ఋణబాధలు ఎక్కువయ్యాయి.**

**జవాబు:** ఉత్తరాన ఇరవై అడుగుల ఖాళీ స్థలం ఉన్నపునపడు పూర్తి వాయువ్యంలో బాత్‌రూమ్ కట్టవలసింది కాదు. వాటిని నిర్మూలించండి. ప్రధాన గృహం నుండి నాలుగు అడుగులు వదిలి ఎనిమిది అడుగులలో టాయిలెట్/బాత్‌రూమ్‌ని నిర్మించండి. ఎనిమిది అడుగులు ఉత్తర వాయువ్యానికి ఖాళీగా వదిలేయండి. తప్పకుండా మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. ఋణ బాధలు తగ్గుతాయి. ■

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:..................................................

కనాడు రవి అస్తమించని ఒక బ్రిటిష్ సామ్రాజ్యంగా వెలుగొంది, భారతదేశాన్ని దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు పాలించిన బ్రిటిష్ దేశపు వాయుదళం రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) పైలట్లకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్), ముగ్గురు అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లను (క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లు) శిక్షణార్థం పంపనుంది. అయితే, భారతదేశపు మొట్టమొదటి తరం సైనిక పైలట్‌లకు రాయల్ ఎయిర్ ఫోర్స్ శిక్షణ ఇచ్చిన దాదాపు ఒక శతాబ్దం



తరం ఆర్ఏఎఫ్ అధికారులకు శిక్షణ ఇచ్చే ఎయిర్ అకాడమీ అయిన రాయల్ ఎయిర్ ఫోర్స్ కాలేజ్

ప్రపంచవ్యాప్తంగా పర్వత, సముద్ర కార్యకలాపాల కోసం కూడా ఆర్ఏఎఫ్ వ్యాలీలో విమాన

# ఐఏఎఫ్ బోధకుల ద్వారా శిక్షణ

తర్వాత, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బోధకులు ఇప్పుడు ఆర్ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ ఫాస్ట్‌జెట్ ట్రైనీలకు శిక్షణ ఇవ్వనుండడం విశేషం. బ్రిటన్ లోని ఆర్ఏఎఫ్ వ్యాలీ ఫాస్ట్ జెట్ పైలట్‌లకు శిక్షణా స్థావరం. “మొదటిసారిగా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బోధకులు యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఆర్ఏఎఫ్ ఫాస్ట్‌జెట్ పైలట్‌లకు శిక్షణ ఇస్తారు” అని బ్రిటిష్ హైకమిషన్‌లోని రక్షణ సలహాదారు రాయల్ నేవీ కమోడోర్ క్రిస్ సాండర్స్ ఎంబిఇ (మెంబర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సిలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్) అన్నారు. ఫిబ్రవరి 12న న్యూఢిల్లీలో జరిగిన 19వ యుకె ఇండియా ఎయిర్ స్టాఫ్ చర్చలలో ఈ సహకారంపై ఇరు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి.

## ఆర్ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు ఫాస్ట్ జెట్ శిక్షణ

ముగ్గురు భారతీయ అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు ఫాస్ట్ జెట్ శిక్షణ ఇవ్వడం ఇదే మొదటిసారి. ప్రారంభంలో ఈ ఏర్పాటు రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. తదుపరి క్రాన్‌వెల్‌కు ఈ సంవత్సరం జనవరిలో మొదటిసారి బోధకుడిగా ఒక భారతీయ వైమానిక దళ అధికారి నియామకానికి కొనసాగింపుగా చేపట్టిన చర్య. దీనితో మూడు బ్రిటిష్ సైనిక అకాడమీలు ఇప్పుడు సంబంధిత సేవల నుండి బోధకులుగా భారతీయ అధికారుల సేవలను వినియోగించు కుంటున్నాయి.

ఎయిర్ స్టాఫ్ అసిస్టెంట్ చీఫ్ ఎయిర్ వైస్ మార్షల్ ఇయాన్ టౌన్సెండ్ మాట్లాడుతూ– రాయల్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మధ్య దీర్ఘకాల సంబంధాన్ని బలోపేతం చేయడంలో ఈ ఒప్పంద లేఖపై సంతకం చేయడం ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. భారతీయ క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లను యుకె మిలిటరీ విమాన శిక్షణ వ్యవస్థలోకి తీసుకురావడం ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సిబ్బంది శిక్షణలో రాణించడానికి మా భాగస్వామ్య నిబద్ధతను బలోపేతం చేస్తుంది అని అభిప్రాయపడ్డారు. యాంగిల్సీలోని ఆర్ఏఎఫ్ వ్యాలీ నం.4 ఫ్లయింగ్ ట్రైనింగ్ స్కూల్‌కు నిలయంగా ఉంది. సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఐఏఎఫ్ ఫ్లైట్ శిక్షకులు బీఏఈ హాక్ టి2 లేదా టెక్సాన్ టి1 విమానాలపై ఆర్ఏఎఫ్ పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఈ స్థావరం 4వ నంబర్ ఫ్లయింగ్ శిక్షణా పాఠశాలకు నిలయంగా ఉంది.

ఇది బిఏఇ సిస్టమ్స్ హాక్ టి2, బీచ్‌క్రాఫ్ట్ టెక్సాన్ టి1 విమానాలతో పాటు పర్వత, సముద్ర శిక్షణ కోసం ఎయిర్‌బస్ జూపిటర్ హెచ్ టి1 హెలికాప్టర్లను కూడా నిర్వహిస్తుంది. భారతదేశం కూడా హాక్‌ను తన ప్రధాన అధునాతన జెట్ శిక్షణా విమానంగా ఉపయోగిస్తుంది. బీఏఈ సిస్టమ్స్ నుండి లైసెన్స్ పొందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఈ శిక్షణా విమానాన్ని తయారు చేస్తుంది. ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్ఏఎఫ్ కమాండర్ల కింద బోధనా విధుల్లో పనిచేస్తున్నప్పుడు ఐఏఎఫ్ కమాండ్ కిందనే ఉంటారు.

## భారత్‌యూకే సహకారం

2023లో, భారత వైమానిక దళం యూకే బహుళపక్ష వాయు విన్యాసం కోబ్రా వారియర్‌లో మొదటిసారిగా పాల్గొంది. కాగా 2024లో, ఐఏఎఫ్ యొక్క మొదటి బహుళపక్ష వాయు యుద్ధ విన్యాసం తరంగ్ శక్తిలో..

పాల్గొన్న వారిలో రాయల్ ఎయిర్ ఫోర్స్ కూడా ఒకటి. మే 2024 నుండి భారత నావికాదళానికి చెందిన ఒక అధికారి బ్రిటానియా రాయల్ నేవల్ కాలేజ్ డార్ట్ మోత్‌లో శిక్షకుడిగా సేవలందిస్తున్నారు. దీనికి కొనసాగింపుగా మే 2025లో రాయల్ మిలిటరీ అకాడమీ శాండ్‌హర్స్ట్‌కు మరొక భారత సైనిక అధికారిని శిక్షకుడిగా నియమించారు. దీంతో ఇప్పుడు మూడు బ్రిటిష్ సైనిక అకాడమీలు తమ తమ విభాగాలలో శిక్షకులుగా భారతీయ అధికారుల సేవలను వినియోగించుకుంటున్నాయి. అంతేకాదు, 2025లో యూకే, భారతదేశం తమ నౌకాదళాలకు చెందిన క్యారియర్ స్ట్రైక్ గ్రూపులను ఉపయోగించి, ఇప్పటివరకు జరిగిన వాటిలోకెల్లా అతిపెద్ద సముద్ర విన్యాసాన్ని నిర్వహించాయి. తదుపరి భారతదేశం, యూకే సంయుక్తంగా 8వ విడత సైనిక విన్యాసాలను 'అజేయ వారియర్' పేరుతో నవంబర్ 17 నుండి నవంబర్ 30, 2025 వరకు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించాయి. సబర్బన్ ప్రాంతాలలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలపై దృష్టి సారించిన ఈ విన్యాసంలో, భారత సైన్యం మరియు బ్రిటిష్ సైన్యానికి చెందిన మొత్తం 240 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఎయిర్ స్టాఫ్ భేటీ వార్షిక సమావేశాలలో ఒక భాగం. ఇందులో సాధారణంగా ఇరుపక్షాల తరపున ఒక రెండు నక్షత్రాలు (టూ స్టార్) లేదా అంతకంటే పై స్థాయి అధికారి పాల్గొని, పరస్పర సైనిక సహకార రంగాలపై చర్చిస్తారు.

## చారిత్రాత్మక ప్రాముఖ్యత

సంఖ్యా పరంగా చూస్తే, ముగ్గురు భారత వాయు దళ శిక్షకులు ఆర్ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు శిక్షణ ఇచ్చేందుకు నియమించబడడం పెద్ద విషయంగా అనిపించకపోవచ్చు. మిత్ర దేశాల వైమానిక దళాల మధ్య ఇటువంటి తాత్కాలిక నియామకాలు అసాధారణమేమీ కాదు. అయితే, ఈ పరిణామానికి చారిత్రక ప్రాముఖ్యత ఉంది. 1932లో భారత వైమానిక దళం స్థాపించబడినప్పుడు, అది శిక్షణ మరియు బోధనా పర్యవేక్షణ కోసం పూర్తిగా రాయల్ ఎయిర్ ఫోర్స్‌పై ఆధారపడింది. ప్రారంభ కోర్సులు పూర్తిగా యునైటెడ్ కింగ్‌డమ్‌లో నిర్వహించబడేవి. శిక్షణా కార్యకలాపాలు భారతదేశానికి తరలిన తర్వాత కూడా, ఫ్లయింగ్ స్కూళ్లలో ఆర్ఏఎఫ్ శిక్షకులే ఆధిపత్యం కొనసాగేది. భారతదేశపు సొంత బోధనా సిబ్బందిని విస్తరించడానికి 1940 ప్రారంభంలో ఉత్తర



భారతదేశంలోని అంబాలా పట్టణంలో ఒక సెంట్రల్ ఫ్లయింగ్ స్కూల్ స్థాపించబడింది. అయినప్పటికీ, 1946 జనవరి వరకు దాదాపు 90 శాతం మంది బోధకులు ఆర్ఏఎఫ్ సిబ్బంది ఉండేవారు. ఆపరేషనల్ స్క్వాడ్రన్‌లలో భారతీయ అధికారుల అవసరం అత్యవసరంగా ఉండటంతో, బోధనా పాత్రల కోసం అందుబాటులో ఉండేవారి సంఖ్య పరిమితంగా ఉండేది. 1940 దశకం మధ్యకాలం నుండి, భారతీయ అధికారులు ఫ్లయింగ్ బోధకులుగా అర్హత సాధించడానికి యూకేకి వెళ్లి, ఆ తర్వాత దేశీయ సామర్థ్యాన్ని పెంపొందించడానికి తిరిగి వచ్చేవారు. ఆర్ఏఎఫ్ పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చేపట్టిన ఉద్దేశపూర్వక ప్రయత్నాలలో భాగంగా, 1946, 1952 మధ్య, దాదాపు 90 మంది భారతీయ అధికారులు యూకే సెంట్రల్ ఫ్లయింగ్ స్కూల్ కోర్సుల నుండి పట్టభద్రులయ్యారు. 1948లో, భారతదేశం అంబాలాలో తన సొంత ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ స్కూల్‌ను స్థాపించి, తరువాత 1954లో దానిని తమిళనాడులోని తాంబరానికి మార్చింది. ఈ సంస్థ దశాబ్దాలుగా, 150కి పైగా కోర్సులు నిర్వహించడం ద్వారా 3,000 మందికి పైగా శిక్షకులను తయారు చేసింది. దీంతో భారత వాయుసేన (ఐఏఎఫ్) పూర్తిగా స్వయం సమృద్ధి గల శిక్షణ వ్యవస్థను రూపొందించుకుంది.

ఒక రక్షణ విశ్లేషకుడి ప్రకారం, 1956 నుండి భారత వైమానిక దళం ఈజిప్ట్, ఇరాక్, ఘనా, నైజీరియా, సింగపూర్, ఇండోనేషియా వంటి దేశాల్లోని శిక్షణా సంస్థలకు మద్దతుగా, శిక్షకులను విదేశాలకు పంపడం ప్రారంభించింది. ఈ నియామకాలు భారతీయ బోధనా ప్రమాణాలు, వృత్తిపరమైన నైపుణ్యంపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించాయి.

## శిక్షణ పొందిన చోటనే శిక్షణ ఇవ్వడం

గతంలో యుద్ధ విమానాలు నడపడం కోసం ఆర్ఏఎఫ్ వ్యాలీలో శిక్షణ పొందిన భారత వాయుసేనకు చెందిన పైలట్లు, ఇప్పుడు ఆర్ఏఎఫ్ వ్యాలీలో అదే బ్రిటిష్ సైనికులకు ఆర్ఏఎఫ్ వ్యాలీలో బోధించడం అనేది ఒక సాధారణమైన పరిణామం కాదని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. అయితే, ఇది పూర్వపు ఆధారపడటాన్ని తిప్పికొట్టడమే. ఒకప్పుడు ఆర్ఏఎఫ్ శిక్షకులపై ఆధారపడిన ఈ విభాగం, ఇప్పుడు బ్రిటన్ సొంత అధునాతన జెట్ పైప్‌లైన్‌లోని శిక్షణకు తన వంతు సహకారం అందించడం భారతీయులుగా మనమందరం గర్వించదగ్గ పరిణామం.

– యేచన్ చంద్రశేఖర్

## ఆయుర్వేద వైద్యుని అంతరంగ కథనం



'ది మెడిసిన్ మేన్', ఒక భారతీయ వైద్యుని ఆత్మకథగా 14 తరాల వైద్య వారసత్వంతో ఆధునిక ఆయుర్వేద వైద్య విజ్ఞానంపై నవీన ఆవిష్కరణలతో సరికొత్త వెలుగు ప్రసరింపచేసిన వైద్యరత్న డాక్టర్ బుక్కా మహేష్‌బాబు జీవన ప్రస్థానం యిది. అత్యంత ప్రతికూల పరిస్థితులలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ తన 30 సంవత్సరాల విశిష్ట అనుభవాన్ని ఫార్మారంగంపై అవతరింపచేసిన స్థితిగతులను డాక్టర్ మహేష్‌బాబు ఈ ఆత్మకథగా గ్రంథస్థం చేసారు. ఆయుర్వేద పాలీ క్లినిక్ నడపటం, అత్యంత సంక్లిష్టమైన కేస్‌లు సక్సెస్ చేయటమే కాకుండా, రేడియో ప్రోగ్రామ్‌లు, పత్రికా రచనలు, షార్ట్ స్టోరీల లాంటి కేస్ స్టడీలతో ఆయుర్వేద ప్రభంజనం డా॥ మహేష్ బాబు సృష్టించారు. గురు ఆయుకేర్‌గా బుక్కా మహేష్‌బాబు ఆయుర్వేదాన్ని తెలుగునాట ప్రజల మధ్యకు తీసుకువెళ్లారు. ఒక్కొక్క మెట్టు ఎక్కి ఆయుర్వేద ప్రాశస్త్యాన్ని ప్రజానీకానికి తెలియచెప్పిన డాక్టర్ మహేష్‌బాబు, అల్లోపతి ప్రభంజనాన్ని తట్టుకొన్న తీరుతెన్నులు కార్పొరేట్ వైద్యరంగానికి సవాలు విసిరిన పోరాటం చారిత్రక వివరాలతో సమగ్రంగా ఈ ఆత్మకథ మొదటి భాగం వెలువడింది.

**(ది మెడిసిన్ మేన్(ఒక భారతీయుని ఆత్మకథ-మొదటి భాగం)-రచన: డాక్టర్ బుక్కా మహేష్‌బాబు; వెల:రూ.750/-; ప్రతులకు: డా.బుక్కా మహేష్‌బాబు, గురు ఆయుకేర్ హాస్పిటల్స్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020)**

పుస్తక సమీక్ష

## మధుర కథాసంపుటి




అతి తేలికైన విషయాలను చక్కని కల్పనా చమత్కృతితో కథలుగా రాయగల నైపుణ్యం వున్న కథా రచయిత్రిగా జొన్నలగడ్డ కనకదుర్గ కథాసంపుటి 'సకలం మధురం' చదువరులను ఆకట్టుకుంటోంది. కాకరతీగ, ఆవకాయ కత్తి, గోరింటాకు, అన్నంగిన్నె, పడిశం వంటి వస్తువులను జొప్పించి సామాన్యంగా మధ్య తరగతి కుటుంబాలు ఎదుర్కొనే సున్నిత సమస్యలను రచయిత్రి ప్రయోజనాత్మకంగా పరిష్కరింపచేయటం ఈ కథలలో ప్రతిభావంతంగా సృష్టించారు. కామన్‌గా ప్రతీ ఇంటా జరిగే సంఘటనలను, సరళమైన పదాలతో అందమైన కథలుగా తీర్చిదిద్దారు. మనసు, ఇల్లు హాయిగా వుంటే చిన్నా చితకా గొడవలు వచ్చినా సర్దుబాటు చేసుకుంటే, వర్షం వెలిసినట్టు సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయో, ముఖ్యంగా కలిసి మెలసి బతకాలనే చక్కటి సందేశం ఈ కథలు అందిస్తున్నాయి.

తెలుగుతనం ఉట్టిపడే భావనలు, ఉమ్మడి కుటుంబాలలో వెనకటి తరాల అమ్మమ్మ, ప్రస్తుతం అమ్మ, భవిష్యత్‌కోసం ముందుకు సాగే అమ్మాయి మహిళల జీవితాలను అవలోకించి, ముఖ్యంగా కుటుంబాలలో మధ్య తరగతి మనస్తత్వ బాంధవ్యాలను సకలం మధురం కథాసంపుటి అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది.

**(సకలం మధురం(కథాసంపుటి)-రచన:జొన్నలగడ్డ కనకదుర్గ; వెల: రూ.150/-లు; ప్రతులకు: విల్లా నం.11, గోల్డెన్ లీవ్స్ విల్లాస్, జైపురి కాలనీ, నాగోల్, హైదరాబాద్-500 068)**

## తొవ్వ నేర్పిన కన్నీటి కవితా స్పర్శ 'గిన్నారపు' కవితలు



ఆ తొవ్వలో అక్షరాలు తొడిగి నడిచిన కవి, మనస్సు గాయాలతో, బాబా సాహెబ్ తన కళ్ళల్లో మెదులుతుంటే ప్రతి అడుగులో కన్నీటి బొట్టును తలచుకుంటూ కవిత్వీకరించిన తీరే 'తొవ్వ నేర్పిన పాఠం'. కవి, గిన్నారపు ఆదినారాయణ దశాబ్దిన్నర వెతల తొవ్వలో, 51 కవితలు వివిధ సందర్భాలలో పలు పత్రికలలో ప్రచురింపబడినవి ఉన్నాయి. 'నువ్వే లేకపోతే' మా వెతలు కథలుగా కన్నీటి కడలిలో కలిసి కనుమరుగయ్యేవాళ్లం అంటారు. 'యుద్ధం వద్దు' అనే కవితలో నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ శాంతి చర్చలతో సమరం ఆపమని కోరటం, కవిత్వం అంటే చెమ్మగిల్లిన కన్నీళ్ళు, శ్రమజీవుల చెమటచుక్కల్ని మూట కట్టడం అనటం,దండానికి దండంలో అమ్మ హృదయాన్ని ఆవిష్కరించటం, కరోనా సంక్షోభవంలోని వాస్తవిక అనుభవాలను కవిత్వీకరించటం ఈ సంపుటిలో డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ తన అనుభవాలు, చూసిన సంఘటనలు సమాజంలోని పరిమాణాలు, తెలంగాణ, దళిత, బహుజన ఉద్యమాల ప్రభావంతో అత్యుత్తమ కవితా రీతులలో స్పందించారు. దళితుల అణచివేత సృష్టించిన ఆవేదన, నిరాశ, అవమానాలు, సామాజిక వివక్షతను డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ హృది కదిలించే కవితా సంపుటిలో చోటు చేసుకున్నాయి.

**(తొవ్వ నేర్పిన పాఠం-రచన: గిన్నారపు ఆదినారాయణ; వెల: రూ.120/-లు; ప్రతులకు: గిన్నారపు ఆదినారాయణ, ప్లాట్ 304, 3-1-23/2, రామ్‌శంకర్ నగర్, బోడ్రాయి, పాత రామంతాపూర్, హైదరాబాద్-500 013)**

– జయసూర్య

# 12 ఏప్రిల్, 2026 నుండి 18 ఏప్రిల్, 2026 వరకు

## వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కుటుంబ సమస్యలు ఎదురై చిరాకు కలిగిస్తాయి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. ప్రముఖులను కలుసుకుంటారు. మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తులకు దూరంగా ఉండడం మంచిది. మూర్ఖులతో వాదించడం వృథా కనుక. మీబాధ్యతల నిర్వహణ, వ్యాపార వ్యవహారాలు చూసుకుంటారు. నిత్యం గణపతి అష్టోత్తరం పఠించండి.

### వృషభం

ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రయత్నాలు పురోగతిలో ఉంటాయి. ఋణబాధలు తొలగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. పాత బాకీలు వసూలవుతాయి. ఆప్తుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. దూరపు బంధువుల నుండి ధన, వస్తులాభం పొందుతారు. పోటీ పరీక్షలు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

### మిథునం

ఈ వారం వాక్చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీ నైపుణ్యానికి తగిన గుర్తింపు లభిస్తుంది. బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. షేర్లు భూమి క్రయవిక్రయాలలో ఊహించని లాభాలు పొందుతారు. స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు.

### కర్కాటకం

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. భూములకు సంబంధించి అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. ప్రముఖులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వ్యవసాయదారులకు పెట్టుబడులు అందుతాయి. వివాహ, ఉద్యోగ యత్నాలుసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వాహన యోగం.

### సింహం

ఈ వారం సంఘంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. కొన్ని పనులలో తొందరపాటు వద్దు. వివాదాలకు దూరంగా వుండటం మంచిది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది.. మిత్రులు, చర్చా, గోష్టులలో చురుకుగా పాల్గొంటారు.

### కన్య

ఈ వారం స్వయం ఉపాధి పథకాలు లభిస్తాయి. సాంకేతిక పరమైన కారణాల వలన అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. వివాహాది శుభకార్యాలను నిర్విఘ్నంగా పూర్తి చేయగలుగుతారు. క్రమశిక్షణకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. పుణ్య క్షేత్రాలను సందర్శిస్తారు. వివాదాస్పద వ్యవహారముల పరిష్కారమునకు మీరు చేసే కృషి ఫలిస్తుంది. ఈవారం చెప్పుకోదగిన ఇబ్బందులేవీ చోటు చేసుకోవు. నిత్యం నాగసింధూరం ధరించండి.

### తుల

ఈ వారం ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. బాధ్యతాయుతంగా వుంటారు. నూతన పెట్టుబడుల విషయాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. నిత్యం లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయడం చెప్పదగిన సూచన. దూరప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలను అందుకుంటారు. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు.

### వృశ్చికం

ఈ వారం ఆప్తుల జోక్యంతో కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలను పరిష్కరించుకుంటారు. అనుకోకుండా చిన్నపాటి విందు కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. భూముల క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు మిత్రత్వానికి దారి తీస్తాయి. మొండిబాకీలను రాబట్టుకోవడానికి కొత్త మార్గాలను అవలంబిస్తారు. మాట పట్టింపులు చిన్నపాటి ఒడిదుడుకులకు దీరితీస్తాయి

### ధనస్సు

ఈ వారం మంచి ఫలితాలను సాధించాలంటే, మంచి పరిచయాలు కూడా అవసరమేనని భావిస్తారు. ఆదిశగా దృష్టిని సారిస్తారు. మంచి చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. మీ పరోక్షంలో జరుగుతున్న అన్యాయాలు వెలుగు చూస్తాయి. బ్యాంక్ ఋణాలు మంజూరవుతాయి. ముఖ్య పత్రములను పోగొట్టుకొనుట లేక తాత్కాలికముగా కనబడకపోవుట వంటి సమస్యలు స్వల్పంగా ఇబ్బందులను కలిగిస్తాయి.

### మకరం

ఈ వారం మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. బాధ్యతలు అధికమవడం వలన శ్రమ అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. చిన్నచిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా జాగ్రత్తలు వహించండి. విస్తృతమైన చర్చలను సాగిస్తారు. మంచి మాటతీరును కనబరుస్తారు. నలుగురితో నారాయణ, పదుగురితో గోవింద అన్న విధంగా మీ ప్రవర్తన, నడవడిక ఉంటాయి.

### కుంభం


ఈ వారం మీకు అందవలసిన బకాయిలు, బిల్స్, క్లైమ్స్ సగానికి పైగా చేతికంది వస్తాయి. వ్యాపార రహస్యాలను బయటకు వెల్లడి చేస్తున్న వారిని కట్టుదిట్టంగా పట్టుకొని తగిన చర్యలు తీసుకుంటారు. విచారణలు, సంప్రదింపులు, సంభాషణలు సందర్శనలు మొదలైనవి అనుకూల ఫలితాలనిస్తాయి. మీరు చేసే నూతన ప్రయత్నాలు అనుకూలించే సూచనలున్నాయి. అయితే మీ వెన్నుతట్టి ప్రోత్సహించేవారు కరువవుతారు.


### మీనం

ఈ వారం ఉత్సాహంగా నూతన వ్యూహ రచన చేస్తారు. ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తారు. శుభప్రదమైన వార్తలు, సమాచారం సంతోషం కలిగిస్తుంది. వ్యక్తిత్వం లేని మనుషులతో పోటీ పెట్టుకోకూ దదని నిర్ణయించుకుంటారు. చాలా మందితో పోలిస్తే మన పరిస్థితి బాగానే ఉన్నదనే నిర్ణయానికి వస్తారు. ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యమేగాని, అన్నింటికీ కాదని గ్రహిస్తారు. మంచి ఆశయాలు కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహంగా మారతాయి. ప్రజాభిమానం పొందుతారు.


# ఈ వారం కార్టూన్స్


చూసారండీ దీని ప్రేమ? బంగారం రేటు తగ్గింది.. ఇంకా నెక్లెస్ చేయించుకోలేదా అంటోంది..!!
Zakir...


ఏమండీ.. నర్సు ముద్దుగా, అందంగా ఉంది కదా..? ఒక్కసారి నోరారా "సిస్టర్" అని పిలవండి..!!
ICU
Zakir...


SIP లాగా ప్రతి నెలా కొంత డబ్బు పోగు చేసి... ఇలా బుక్స్ కొంటా...!!
బుక్ ఫెయిర్
Zakir...





ప్రపంచంలోని
అతి పెద్ద బౌద్ధాలయ ప్రాంగణంలోని చిత్రాలివి.
ఈ ప్రాంగణం ఇండోనేషియాలోని జావా ద్వీపంలో ఉంది.
ఈ ప్రాంగణంలో మూడు పురాతన
ఆలయాలన్నాయి.







